# విశాల భారతి

తెలుగు దినపత్రిక

19-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 48


## సాంకేతిక విప్లవంలో భారత్ సరికొత్త అధ్యాయం

- మానవ చరిత్రలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అతిపెద్ద సాంకేతిక మార్పు
- ఏఐ రంగంలో పరిశోధనలు, వినియోగంలో భారత్ అగ్రగామిగా ఎదుగుతుంది
- విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల వ్యయంతో ఏఐ హబ్ ఏర్పాటు
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా 10,000 పాఠశాలల్లో జెన్-ఏఐ టూల్స్
- భారత్-అమెరికా మధ్య కొత్త సబ్-సీ కేబుల్ మార్గాల ఏర్పాటు
- ప్రధాని మోదీ దార్శనికతతో డిజిటల్ ఇండియా నుంచి 'ఏఐ ఇండియా' దిశగా

02




# తెలంగాణలో రాజ్యసభ పోరు..!

## తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాల భర్తీకి ఈసీ షెడ్యూల్ విడుదల

### అసెంబ్లీలో బలాబలాల ప్రకారం రెండు సీట్లూ కాంగ్రెస్‌కే దక్కే అవకాశం

- మార్చి 16న పోలింగ్, అదే రోజున ఫలితాల వెల్లడి
- పోటీలో లేని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్; ఏకగ్రీవమయ్యే సూచనలు
- ఆశావహుల జాబితాలో హనుమంతరావు, జానారెడ్డి వంటి సీనియర్లు
- ఢిల్లీ కోటాలో అభిషేక్ సింఘ్వీ పేరుపై కొనసాగుతున్న ఉత్కంఠ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరోమారు వేడెక్కింది. రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం నగారా మోగించడంతో అధికార కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా సందడి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయభేరి మోగించిన ఉత్సాహంలో ఉన్న హస్తం పార్టీకి, ఇప్పుడు ఈ రెండు స్థానాలను కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, విజయం ఖాయమని తెలిసినా, ఆ రెండు బెర్తులపై కూర్చునే అదృష్టవంతులు ఎవరన్నదే ఇప్పుడు సచివాలయ కారిడార్ల నుంచి గాంధీ భవన్ వరకు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బేరీజు వేసుకుంటే, ఒక్కో రాజ్యసభ అభ్యర్థి గెలుపునకు సుమారు 40 మంది సభ్యుల మద్దతు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 64 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో పాటు, ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన ఎమ్మెల్యేల మద్దతు కూడా తోడైంది. దీంతో రెండు స్థానాలను సునాయాసంగా గెలుచుకునే మెజారిటీ ప్రభుత్వానికి అందుబాటులో ఉంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సంఖ్యాపరంగా బలహీనపడటంతో, ఈ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టే సాహసం చేయడం లేదని తెలుస్తోంది. ఫలితంగా ఈ ఎన్నికలు ఏకగ్రీవమయ్యే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి.

మిగతా 3లో..

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

- క్యాతన్‌పల్లిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది
- మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ బీఆర్ఎస్-కాంగ్రెస్ ఘర్షణ
- ఎస్ఐ గంగారాంపై అనుచిత వ్యాఖ్యలు, విధులకు ఆటంకం
- మంత్రి కాన్వాయ్‌పై దాడి ఆరోపణలు, పలువురిపై కేసులు
- రామకృష్ణాపూర్‌లో భారీగా మోహరించిన పోలీసు బలగాలు
- సుమన్‌ను రహస్య ప్రాంతానికి తరలింపు, కోర్టులో హాజరు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ వేదికగా గత రెండు రోజులుగా సాగుతున్న రాజకీయ రగడ చివరకు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. బుధవారం తెల్లవారుజాము నుంచే నాటకీయ పరిణామాలు చోటుచేసుకోగా, బీఆర్ఎస్ కీలక నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్లు, పోలీసుల విధులకు విఘాతం కలిగించడం, అధికారులపై వ్యక్తిగత దూషణలకు దిగారన్న అభియోగాలతో ఈ అరెస్ట్ పర్వం కొనసాగింది.

మిగతా 2లో..



02

## ధరణి దోపిడీపై ఉక్కుపాదం

- ధరణిలో లోపాలు యాదృచ్ఛికం కాదు, కావాలని సృష్టించినవే
- టెర్రాసిస్ సంస్థకు బాధ్యతలు అప్పగించడం వల్లే డేటా భద్రతకు ముప్పు
- తక్షణమే పోర్టల్‌పై సమగ్ర కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- అక్రమ లావాదేవీల జాడ దొరకకుండా లాగిన్ వివరాల తొలగింపు
- స్టాంప్ డ్యూటీ ఎగ్గొట్టిన వారిని, అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- భవిష్యత్తులో పారదర్శకత కోసం కొత్త పోర్టల్ ద్వారా భూపాలన

02




## ఐటీ కలలకు టవర్ సెగ

- జిల్లా ఐటీ టవర్లలో ఆశించిన స్థాయిలో అందని ఉద్యోగ కల్పన
- 25 వేల ఉద్యోగాల లక్ష్యం ఉన్నా, 10 శాతం కూడా భర్తీ కాని వైనం
- నల్గొండలో రూ.95 కోట్లతో నిర్మించినా డేటా ప్రాసెసింగ్ పనులకే
- సూర్యాపేటలో అద్దె భవనంలో అరకొర వసతులు
- ఆదాయం రాకపోయినా నిర్వహణ కోసం టీఎస్ఐఐసీపై భారాలు
- సొంత ఊర్లో కొలువు దొరక్క మళ్లీ హైదరాబాద్ బాట పడుతున్న యువత

02

## 'వడ్డీతో సహా చెల్లిస్తాం'



- బాల్క సుమన్ అరెస్టు అక్రమం, రాజకీయ కుట్ర
- మున్సిపాలిటీ కోసమే కాంగ్రెస్ అడ్డదారులు
- వడ్డీతో సహా చెల్లిస్తాం.. కేటీఆర్ హెచ్చరిక
- పోలీసుల తీరుపై వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం
- క్యాతన్‌పల్లి ప్రజల నిరసనను ప్రభుత్వం గమనించాలి
- సుమన్‌ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికార బలంతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ఠ అని ఆయన ఘాటుగా విమర్శించారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ రాజకీయ పరిణామాలు ఈ అరెస్టుకు దారితీశాయని కేటీఆర్ ఆరోపించారు. మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీ ఈ కుట్రకు తెరలేపిందని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 3లో..

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీల హవా

- రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారిన బీసీ ఓటు బ్యాంక్
- గతానికి భిన్నంగా పెరిగిన సామాజిక, రాజకీయ చైతన్యం
- అగ్రవర్ణాల ఆధిపత్యానికి సవాల్ విసురుతున్న బీసీ నేతలు
- ప్రధాన పార్టీల మేనిఫెస్టోల్లో బీసీ డిక్లరేషన్ల హోరు
- జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపుపై పెరుగుతున్న డిమాండ్
- భవిష్యత్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు బీసీలే గీటురాయి

02



## మాజీ భార్యను కిరాతకంగా చంపిన టెకీ

- వనస్థలిపురం గ్రీన్‌సిటీ కాలనీలో దారుణ హత్య
- విడాకులు ఇచ్చి మరో పెళ్లి చేసుకుందని అక్కసు
- కత్తులు, పెట్రోల్‌తో వచ్చి మాజీ భార్యపై దాడి
- రక్తపు మడుగులో ఉన్నా వదలకుండా పూలకుండీలతో దాడి
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనా స్థలంలో విషాదఛాయలు, స్థానికుల ఆందోళన

04



## నేలమ్మ ఒడిలో నడక..!

- ఒట్టికాళ్లతో నడక వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది
- మెదడు నాడులు ఉత్తేజితమై జ్ఞాపకశక్తి పెరుగుతుంది
- హ్యాపీ హార్మోన్ల విడుదలతో మానసిక ప్రశాంతత లభిస్తుంది
- శరీరంలో హార్మోన్ల సమతుల్యత ఏర్పడి నిద్రలేమి తగ్గుతుంది
- భూమిలోని పాజిటివ్ ఎలక్ట్రాన్లతో సానుకూలత పెరుగుతుంది
- సహజ సిద్ధమైన ఆక్యుప్రెషర్ ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుంది

**ఆరోగ్యమస్తు:**

నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో చిన్నారుల పెంపకం విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తలు వహిస్తున్నారు. పసిపిల్లల పాదాలు కందిపోతాయని, మట్టి అంటుకొని రోగాల బారిన పడతారని బయట అడుగుపెట్టేటప్పుడే సాక్సులు, షూలతో కట్టడి చేసేస్తున్నారు. ఇంట్లో ఉన్నా సరే మెత్తటి తివాచీలు, చెప్పులతోనే నడిపిస్తున్నారు. అయితే ఈ 'అతి జాగ్రత్త' పిల్లల సహజ ఎదుగుదలకు ఆటంకంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రకృతితో నేరుగా సంబంధం కలిగి ఉండటం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలను చిన్నారులు కోల్పోతున్నారని వారు వివరిస్తున్నారు. ముఖ్యంగా

మిగతా 3లో..



# ధరణి దోపిడీపై ఉక్కుపాదం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వ్యవహారం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఈ పోర్టల్ పనితీరును, అందులో జరిగిన అక్రమాలను విశ్లేషిస్తుంటే 'తీగ లాగితే డొంక కదిలినట్లు' విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల భూములకు రక్షణగా ఉండాల్సిన వ్యవస్థను, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొందరు నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డదారిలో వాడుకున్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం సచివాలయంలో ధరణి లోపాలపై ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ధరణి పోర్టల్‌లో ఉన్న సాంకేతిక, వ్యవస్థాగత లోపాలపై ప్రభుత్వం నియమించిన కమిటీ లోతుగా విచారణ జరుపుతోంది. ఈ విచారణలో భాగంగా బయటపడుతున్న విషయాలు కేవలం సాదాసీదా సాంకేతిక తప్పిదాలు కావని, ఇవి ఉద్దేశపూర్వకంగా వ్యవస్థను మేనేజ్ చేస్తూ సృష్టించిన లోపాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించిన సమయంలోనే అనేక లోపాలను గుర్తించినప్పటికీ, వాటిని సరిదిద్దకుండానే అంతా సవ్యంగా ఉందంటూ తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే సామాన్యుల భూములకు భద్రత లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తుల ప్రమేయంతో కావాలని తప్పులు చేసే విధంగానే ధరణి సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారని ప్రాథమిక విచారణలో తేలింది. ముఖ్యంగా భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న డేటా చిక్కకుండా ఉండేందుకు కొన్ని కీలక లాగిన్ ఐడీలను శాశ్వతంగా తొలగించడం గమనార్హం. అత్యంత రహస్యంగా ఉండాల్సిన లాగిన్ వివరాలు మాయం కావడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగిన భూ దందాల సమాచారం భవిష్యత్తులో ఎవరికీ లభించకూడదనే ఉద్దేశంతోనే ఈ విధ్వంసానికి పాల్పడ్డారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



మరో దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే, ధరణి పోర్టల్‌కు సంబంధించి గతంలో నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో అసలైన 'కోడ్ ఆడిట్' నిర్వహించలేదనే విషయం ఇప్పుడు బహిర్గతమైంది. సాఫ్ట్‌వేర్ లోపల ఏయే మార్పులు చేశారు, ఎవరు యాక్సెస్ చేశారనే కోడ్ విశ్లేషణ చేయకపోవడం వల్ల అక్రమార్కులకు వెసులుబాటు కలిగిందని మంత్రి పేర్కొన్నారు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే పూర్తిస్థాయి కోడ్ ఆడిట్ నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. టెక్నాలజీ మాటున జరిగిన ఈ భూ దోపిడీని సాంకేతిక పరిజ్ఞానంతోనే పట్టుకోవాలని ప్రభుత్వం పట్టుదలతో ఉందని ఆయన వెల్లడించారు.

రాష్ట్ర ప్రజల భూముల వివరాలు ఉండే అత్యంత కీలకమైన పోర్టల్ బాధ్యతలను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడమే అన్ని సమస్యలకు మూలమని పొంగులేటి తేల్చి చెప్పారు. స్థానిక సంస్థలకు లేదా ప్రభుత్వ విభాగాలకు ఇవ్వాల్సిన బాధ్యతను ప్రైవేటు చేతుల్లో పెట్టడం వల్ల డేటా సెక్యూరిటీ ప్రమాదంలో పడిందని ఆయన ఆరోపించారు. విదేశీ సంస్థల ప్రమేయం వల్ల మన రాష్ట్ర భూముల సమాచారం బయటకు పొక్కే అవకాశం ఉందని, దీనిపై కూడా లోతైన విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారంలో పారదర్శకత అనేది మచ్చుకైనా కనిపించడం లేదని ఆయన విమర్శించారు.

ధరణిలోని లోపాలను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ఖజానాకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెద్ద ఎత్తున కొల్లగొట్టారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా, ఏ స్థాయిలో ఉన్నా సరే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేసే వరకు విశ్రమించబోమని, ప్రజా ధనాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

రాష్ట్రవ్యాప్తంగా ధరణి ద్వారా జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. ఇప్పటికే సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్ విజయవంతమైందని, అదే తరహాలో రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లోనూ వెంటనే ఆడిట్ ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా డేటాను విశ్లేషించినప్పుడు అసలు ఎన్ని ఎకరాల భూమి చేతులు మారింది, అందులో అక్రమంగా జరిగిన లావాదేవీలు ఎన్ని అనేది స్పష్టంగా తెలుస్తుందని ఆయన భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం 'భూభారతి' అనే సరికొత్త పోర్టల్‌ను తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. ధరణిలో ఉన్న చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అత్యాధునిక సాంకేతికతతో పారదర్శకమైన వ్యవస్థను రూపొందించాలని మంత్రి అధికారులను కోరారు. రైతులు, సామాన్యులు తమ భూముల వివరాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ఆయన ఆకాంక్షించారు. భూభారతి ద్వారా భూపాలనలో కొత్త అధ్యాయం మొదలవుతుందని, ఇది ప్రజల భూములకు పటిష్టమైన కవచంలా పని చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, ప్రతి ఎకరాకు భద్రత కల్పిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికి తీసి, బాధితులకు న్యాయం చేస్తామని ఆయన చెప్పారు. గత ప్రభుత్వంలో కొందరు కబ్జాదారులు, భూమాఫియా నేతలు చేసిన తప్పిదాలకు సామాన్య ప్రజలు బలి కాకూడదనేదే తమ ఉద్దేశమని వివరించారు. ఈ ప్రక్షాళన ప్రక్రియలో రెవెన్యూ యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండి, విచారణకు సహకరించాలని ఆయన కోరారు. త్వరలోనే పూర్తి వివరాలతో కూడిన నివేదికను ప్రజల ముందు ఉంచుతామని వెల్లడించారు.

---

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు
# నాయకత్వం వహించాలి

**నూతన సర్పంచులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

గ్రామాల సమగ్రాభివృద్ధిలో గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్పంచులకు పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 471 మంది గ్రామపంచాయతీ సర్పంచులకు విడతల వారీగా శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండవ విడత శిక్షణ కార్యక్రమం 17022026 నుండి 21022026 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. రెండవ విడతలో భాగంగా అశ్వారావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది నూతన సర్పంచులు శిక్షణలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ పాలన, పరిపాలన విధానాలు,



బాధ్యతలు, కర్తవ్యాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని అన్నారు. శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామపంచాయతీలకు అందుతున్న అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించి తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయిలెట్లు వంటి వసతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని సర్పంచులు నిరంతరం పర్యవేక్షించి చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ లేదో పరిశీలించాలని సూచించారు.

---

# సాంకేతిక విప్లవంలో భారత్ సరికొత్త అధ్యాయం

**విశాలభారతి, జాతీయం:**

అంతర్జాతీయ సాంకేతిక యవనికపై భారత దేశం ఒక అద్భుతమైన శక్తిగా ఎదుగుతోందని గూగుల్ అండ్ ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రశంసించారు. ప్రస్తుతం దేశం ఒక చరిత్రాత్మకమైన సాంకేతిక పరివర్తన దశలో ఉందని, ఇది రాబోయే దశాబ్ద కాలపు అభివృద్ధికి బలమైన నాంది అని ఆయన అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాదని, అది సామాన్యుడి జీవితాన్ని మెరుగుపరిచే ఒక గొప్ప సాధనమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఏఐ విప్లవంలో భారత్ కీలక పాత్ర పోషించబోతోందని పిచాయ్ పేర్కొన్నారు. గతంలో ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు ఏ విధంగా అయితే ప్రపంచాన్ని మార్చేశాయో, అంతకంటే వేగంగా ఏఐ ప్రభావం ఉండబోతోందని ఆయన విశ్లేషించారు. ముఖ్యంగా భారతదేశంలో ఉన్న వైవిధ్యం, భాషా సంపద మరియు ఇప్పటికే ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏఐ ఆవిష్కరణలకు ఒక అద్భుతమైన ప్రయోగశాలగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశం తన డిజిటల్ ప్రయాణంలో సాధించిన పురోగతి అమోఘమని పిచాయ్ కొనియాడారు. భారతీయ వినియోగదారులు కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుంటారని, ముఖ్యంగా వాయిస్, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా వాడుతున్న దేశం భారత్ అని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో గూగుల్ రూపొందించిన ఏఐ మోడల్ 'జెమినై'కి భారతదేశం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మరియు అతిపెద్ద మార్కెట్‌గా అవతరించడం విశేషమన్నారు.

సాంకేతికత కేవలం నగరాలకే పరిమితం కాకుండా మారుమూల ప్రాంతాలకు చేరాలన్నదే తమ లక్ష్యమని పిచాయ్ పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణలో వ్యాధి నిర్ధారణ పరీక్షల నుంచి, వ్యవసాయ రంగంలో రైతులకు వాతావరణ హెచ్చరికలు జారీ



చేసే వరకు ఏఐ అనేక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో సామర్థ్యాన్ని పెంచేందుకు 'కర్మయోగి భారత్' వంటి సంస్థలతో కలిసి గూగుల్ పనిచేస్తోందని, దీనివల్ల 20 మిలియన్ల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మేలు జరుగుతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేయబోతున్న మొట్టమొదటి ఏఐ హబ్ గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సుమారు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో, అదానీ గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని నిర్మిస్తున్న ఈ కేంద్రం, అమెరికా వెలుపల గూగుల్‌కు అతిపెద్ద ఏఐ మరియు డేటా సెంటర్ కానుంది. ఇది దేశంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఏఐ మౌలిక సదుపాయాల కల్పనలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భావి తరాలను సిద్ధం చేసే దిశగా గూగుల్ కీలక అడుగులు వేస్తోంది. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి 10,000 పాఠశాలల్లో జెనరేటివ్ ఏఐ టూల్స్‌ను ప్రవేశపెడుతున్నట్లు పిచాయ్ ప్రకటించారు. విద్యార్థులకు చిన్న వయసులోనే కోడింగ్, రోబోటిక్స్ మరియు ఏఐ వంటి అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా వారిలో సృజనాత్మకతను, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌అమెరికా మధ్య సాంకేతిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు 'ఇండియాఅమెరికా కనెక్ట్ ఇనిషియేటివ్'ను ఆయన ప్రకటించారు. దీని కింద సముద్రగర్భ కేబుల్ మార్గాల ద్వారా రెండు దేశాల మధ్య హైస్పీడ్ ఏఐ కనెక్టివిటీని మెరుగుపరచనున్నారు. ఇది కేవలం డేటా బదిలీకే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఏఐ పరిశోధనలకు, సహకారానికి ఒక వారధిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీని గుర్తు చేసుకుంటూ, 'వికసిత్ భారత్ 2047' విజన్‌లో సాంకేతికత పోషించే పాత్రపై చర్చించినట్లు తెలిపారు. ఏఐ రంగంలో ప్రభుత్వం చూపుతున్న చొరవ, పెట్టుబడులకు ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ఐఐటీలు, స్థానిక సంస్థలతో కలిసి గూగుల్ చేస్తున్న పరిశోధనలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా ఏఐ ఫలాలను అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఏఐ వినియోగంలో నైతికత, భద్రత, పారదర్శకత అత్యంత ముఖ్యమని పిచాయ్ హెచ్చరించారు. సాంకేతికత ఎంత శక్తివంతమైనదో, దానిని అంతే బాధ్యతాయుతంగా ఉపయోగించాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నప్పుడే ఏదైనా సాంకేతికత విజయవంతమవుతుందని, అందుకే గూగుల్ ఎప్పుడూ బాధ్యతాయుతమైన ఏఐ వైపే మొగ్గు చూపుతుందని స్పష్టం చేశారు. భారతదేశం కేవలం సాంకేతికతను వాడే దేశంగానే కాకుండా, ప్రపంచానికి ఏఐ పరిష్కారాలను చూపే దేశంగా ఎదుగుతుందని పిచాయ్ ఆకాంక్షించారు. సరైన విధానాలు, మౌలిక సదుపాయాలు, యువతలోని ప్రతిభ తోడైతే, భారత్ గ్లోబల్ ఏఐ హబ్‌గా మారడం ఖాయమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఇది భారతదేశపు దశాబ్దం అని, ఈ ప్రయాణంలో గూగుల్ ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటుందని పునరుద్ఘాటించారు.

---

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

దీంతో పారిశ్రామిక ప్రాంతమైన రామకృష్ణాపూర్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నుంచే పరిస్థితి చేయి దాటుతూ వచ్చింది. చైర్మన్ పీఠం దక్కించుకునే క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ బాహాబాహీకి దిగారు. ఈ క్రమంలోనే స్థానిక ఎస్ఐ ఎ. గంగారాం విధులను అడ్డుకున్నారని, ఆయనను ఉద్దేశించి బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేస్తూ అసభ్య పదజాలంతో దూషించారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే రెచ్చగొట్టేలా వ్యవహరించడం వల్ల ఘర్షణలు తీవ్రమయ్యాయని పోలీసు యంత్రాంగం నిర్ధారణకు వచ్చింది.

అరెస్ట్ సమయంలో బాల్క సుమన్ నివాసం వద్ద దృశ్యాలు సినిమాటిక్ ఫీల్‌ను తలపించాయి. వందలాది మంది పోలీసులు ఒక్కసారిగా ఆయన ఇంటిని ముట్టడించగా, సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. పోలీసు వాహనాలను అడ్డుకుంటూ కార్యకర్తలు బైఠాయించడంతో తోపులాట జరిగింది. తమ నాయకుడిని అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు. ఈ ఘర్షణలో పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి, పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది.

ఈ కేసులో బాల్క సుమన్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు రాజా రమేష్, మూల రాజిరెడ్డి, అనిల్, గాజుల చంద్రకిరణ్ వంటి పదిమందికి పైగా నాయకులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. సెక్షన్ 189(3) ప్రకారం చట్టవిరుద్ధమైన సమావేశం నిర్వహించడం, అల్లర్లకు పాల్పడటం, ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం వంటి ఆరోపణలను పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ గంగారాం ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు ఈ విచారణ వేగవంతమైంది. ప్రజాప్రతినిధులు చట్టాన్ని గౌరవించకుండా అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ఉన్నతాధికారులు వెల్లడించారు.



మరోవైపు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై కూడా రాళ్ల దాడి జరిగినట్లు వస్తున్న వార్తలు జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద బారికేడ్లను ధ్వంసం చేస్తూ ఆందోళనకారులు దూసుకురావడం, అటుగా వెళ్తున్న మంత్రి వాహన శ్రేణిపై రాళ్లు విసరడంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సిసిటివి దృశ్యాలను సేకరించి బాధ్యులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటనలో పోలీసు వాహనాలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం, ఇది శాంతిభద్రతల సమస్యగా మారిందని పోలీస్ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

మంచిర్యాల పట్టణంలో ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. బాల్క సుమన్‌ను మంచిర్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా, భద్రతా కారణాల దృష్ట్యా వేరే ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. అనంతరం ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. ఈ లోపు రామకృష్ణాపూర్, మందమర్రి మరియు మంచిర్యాల ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ తరహా ఆంక్షలను పోలీసులు విధిస్తున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ గుంపులుగా ఉన్న వారిని చెదరగొడుతున్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు ఈ అరెస్టును రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, దానిని ప్రశ్నించినందుకే తమ నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, పోలీసులు మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విధుల్లో ఉన్న అధికారులపై దాడి చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. రాజకీయ వర్గాల మధ్య నెలకొన్న ఈ వైరం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని రాష్ట్రవ్యాప్త చర్చాంశనీయంగా మార్చింది.

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడటం లేదా కొనసాగడంపై స్పష్టత లేనప్పటికీ, ప్రస్తుతం అందరి దృష్టి బాల్క సుమన్ రిమాండ్ ప్రక్రియపైనే ఉంది. దేవపూర్ ఎస్ఐపై జరిగిన దాడిని పోలీస్ అసోసియేషన్ సైతం తీవ్రంగా ఖండించింది. పోలీసులు సంయమనం పాటిస్తున్నా, వారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ కేసులో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతానికి మంచిర్యాల జిల్లా అంతటా పోలీసు బలగాల పహారా కొనసాగుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అరెస్ట్ అయిన నాయకులను కలిసేందుకు వెళ్తున్న వారిని కూడా పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఐటి సెల్ హెచ్చరికలు జారీ చేసింది. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను గమనిస్తూ, ఇది మున్సిపల్ రాజకీయాల నుంచి రాష్ట్ర స్థాయి వివాదంగా మారుతుందని భావిస్తున్నారు.

---

## పిఏడి సమస్య వచ్చిన వారికి
# ఎండోవ్యాస్కర్ టెక్నిక్ ద్వారా వైద్యం

**ఖమ్మం, విశాలభారతి:**

ఖమ్మం యశోద హాస్పిటల్ లో జరిగిన సమావేశంలో ఎంబిబిఎస్ , ఎంఎస్ ( జనరల్ సర్జరీ ) , డి ఎన్ బి (వసక్యూలర్ సర్జరీ ) , కన్సల్టెంట్ వసక్యూలర్ & ఎందువాసక్యూలర్ సర్జన్ ఫుట్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీ కాంత్ రాజు మాట్లాడుతూ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ నందు పిఏడి సమస్య వచ్చిన వారికి అడ్వాన్స్ టెక్నాలజీ ప్రొసీజర్ తో అత్యాధునిక సదుపాయాలతో అతి తక్కువ ఖర్చుతో ఓల్డ్ క్లాస్ స్థాయిలో ఎండోవ్యాస్కర్ టెక్నిక్ ద్వారా వైద్యం అందిస్తున్నాం అన్నారు . ఈ ప్రొసీజర్ ను నిడిల్ పంచర్ ద్వారా జస్ట్ వైర్లు పాస్ చేస్తారు ఎక్కడ కూడా ఒక్క కోత కూడా కనబడదు ఎటువంటి మత్తుమందు ఇవ్వకుండా పేషంట్ స్పృహలో ఉన్నప్పుడే చేస్తారన్నారు . ఆ తర్వాతకి యధా విధంగా అన్ని పనులు చేసుకోవచ్చు అని తెలిపారు . కాళ్లకు సంబంధించిన ఫిజికల్ యాక్టివిటీ వ్యాయామం చేయడం , దుమ్మపానం , మద్యపానాలకు దూరంగా ఉండటం వల్ల ఆపరేషన్ ద్వారా వచ్చే ఫలితాన్ని ఎక్కువకాలం అనుభవించగలరని పేర్కొన్నారు . యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇన్ఫో స్ట్రక్చర్ ఉండటం వల్ల ఇప్పటివరకు ప్రతి నెల సుమారు 100 నుంచి 150 మంది పేషెంట్లను రికవరీ చేసి పంపిస్తున్నామన్నారు




. ప్రతి ముగ్గురిలో ఒకరికి షుగరు కంపల్సరిగా ఉంటుందని షుగర్ ఉండే వంద మందిలో 30 మందికి పెరిఫెరల్ అరటీరియల్ డిసైజ్ (పిఏడి) సమస్య ఉంటుందన్నారు . ఈ సమస్య వచ్చిన వారిలో మూడు రకాల సింటమ్స్ చూపిస్తుంది . ఫస్ట్ ది నడిచేటప్పుడు పిక్కలు బాగా పట్టుకుని భరించరని నొప్పితో ఏటువంటి పని చేసుకోలేరు , రెండవది పాదాలలో భరించరాన్ని నొప్పుతో నిద్ర పట్టక మనిషి ఆత్మహత్య చేసుకోవాలనే స్థితిలో ఉంటాడు , మూడవది మానని గాయాలు కాళ్లలో అవడం , కాళ్లలో ఒక భాగం నల్లగా మారడం , కుళ్ళిపోవడం , దుర్వాసన రావడం వంటి లక్షణాలు ఉంటాయి . అలా ఉన్నప్పుడు వెంటనే వాస్కులర్ సర్జన్ డాక్టర్ ను కలిసి సలహా సూచనలు తీసుకోవాలన్నారు

---

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీల హవా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. ఒకప్పుడు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించబడిన వెనుకబడిన తరగతులు (బీసీలు), నేడు రాజకీయ గమనాన్ని శాసించే శక్తిగా ఎదిగారు. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న రాజకీయ సమీకరణాలను బీసీ చైతన్యం ఒక్కసారిగా తిరగరాస్తోంది. క్షేత్రస్థాయిలో పెరిగిన అవగాహన, తమ హక్కుల పట్ల యువతలో వచ్చిన మార్పు రాజకీయ పార్టీలను పునరాలోచనలో పడేస్తున్నాయి. గతంలో కొన్ని సామాజిక వర్గాలకే పరిమితమైన అధికారం, ఇప్పుడు 'జనాభా ప్రకారం వాటా' అనే నినాదంతో కొత్త మలుపు తిరుగుతోంది. ఇది కేవలం ఎన్నికల వ్యూహం మాత్రమే కాదు, తెలంగాణ సమాజంలో వస్తున్న పెను మార్పుకు సంకేతం. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల మద్దతు లేనిదే ఏ పార్టీ కూడా అధికార పీఠాన్ని అధిరోహించలేదనే సత్యం ఇప్పుడు స్పష్టమైంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, బీసీల ఓట్లు చీలిపోవడం వల్ల కొన్ని పార్టీలు నష్టపోగా, గంపగుత్తగా ఓట్లు పడిన చోట ఊహించని విజయాలు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ మరియు బిజెపిలు బీసీలను ఆకట్టుకోవడానికి పోటీ పడుతున్నాయి. 'బీసీ డిక్లరేషన్' పేరుతో భారీ హామీలను ప్రకటిస్తూ, వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కేటాయింపులు కేవలం నిధులకే పరిమితం కాకుండా, నిర్ణయాధికారంలో




భాగస్వామ్యం కోరుతుండటం ఇక్కడ గమనార్హం. ప్రస్తుత తరం రాజకీయాల్లో యువత పాత్ర కీలకంగా మారింది. డిజిటల్ మీడియా విప్లవం వల్ల సామాజిక న్యాయం పట్ల అవగాహన పెరిగింది. పాతతరం నాయకులు అనుసరించిన సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెబుతూ, నేటి యువత అభివృద్ధి మరియు ఆత్మగౌరవం రెండింటినీ కోరుకుంటున్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు రాజకీయాల్లో తమ సామాజిక వర్గానికి దక్కాల్సిన గౌరవం గురించి వారు గళమెత్తుతున్నారు. ఈ మార్పు వల్ల రాజకీయ పార్టీలు కూడా తమ అభ్యర్థుల ఎంపికలో కొత్త పద్ధతులను అనుసరించక తప్పడం లేదు. బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా మాత్రమే క్షేత్రస్థాయిలో పట్టు సాధించగలమని అధిష్టానాలు భావిస్తున్నాయి. బీసీ కులాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను తొలగించి, వారిని ఒకే తాటిపైకి తీసుకురావడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో ఉప కులాల వారీగా ఉన్న చీలికలు రాజకీయంగా వారికి నష్టం చేకూర్చాయి. అయితే, ఇప్పుడు 'బీసీ ఐక్యత' అనే అంశం బలంగా వినిపిస్తోంది. రాజకీయంగా ఎదగాలంటే ఐకమత్యం అవసరమని సామాజిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది గమనించిన పార్టీలు, ప్రతి ఉప కులానికి ప్రాధాన్యత ఇచ్చేలా తమ ప్రచార శైలిని మార్చుకుంటున్నాయి. కార్పొరేషన్ల ఏర్పాటు, నిధుల కేటాయింపు వంటి చర్యల ద్వారా అన్ని వర్గాల నమ్మకాన్ని చూరగొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. గతంలో రాజకీయాలంటే కొన్ని కుటుంబాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ, నేడు సాధారణ బీసీ కార్యకర్త కూడా ఎమ్మెల్యే లేదా ఎంపీ కావాలనే ఆకాంక్షతో ముందుకు వస్తున్నారు. ఈ ఆకాంక్ష తెలంగాణ రాజకీయాల్లో కొత్త పోటీని సృష్టిస్తోంది. టికెట్ల కేటాయింపు సమయంలో బీసీ అభ్యర్థుల సంఖ్యను పెంచాలని అన్ని వర్గాల నుండి ఒత్తిడి పెరుగుతోంది. జనాభా నిష్పత్తికి అనుగుణంగా సీట్లు ఇవ్వని పక్షంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. దీనివల్ల పార్టీలు తమ పాత వ్యూహాలను పక్కన పెట్టి, సామాజిక సమతుల్యతను పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్థికంగా బలపడుతున్న బీసీ వర్గాలు ఇప్పుడు రాజకీయాల్లో పెట్టుబడి పెట్టడానికి కూడా వెనుకాడటం లేదు. సొంతంగా ఎదిగిన వ్యాపారవేత్తలు, విద్యావంతులు రాజకీయాల్లోకి ప్రవేశించడం వల్ల బీసీ నాయకత్వానికి కొత్త గ్లామర్ వచ్చింది. వీరు కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, ప్రణాళికాబద్ధంగా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. దీంతో అగ్రవర్ణ నేతల ఆధిపత్యం ఉన్న నియోజకవర్గాల్లో సైతం గట్టి పోటీ కనిపిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమని, దీనివల్ల పాలనలో అన్ని వర్గాల భాగస్వామ్యం పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీసీల జీవన ప్రమాణాలను కొంతమేర మెరుగుపరిచాయి. అయితే, కేవలం సంక్షేమమే సరిపోదని, రాజకీయ సాధికారత కావాలని వారు కోరుతున్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో బీసీ సబ్‌ప్లాన్ వంటి డిమాండ్లు తెరపైకి రావడానికి ఇదే కారణం. చట్టసభల్లో తమ వాణి వినిపించే నాయకులు తక్కువగా ఉన్నారనే అసంతృప్తి వారిలో గూడుకట్టుకుంది. ఈ అసంతృప్తిని ఓట్లుగా మార్చుకునేందుకు విపక్షాలు ప్రయత్నిస్తుంటే, తాము చేసిన అభివృద్ధిని చాటిచెప్పేందుకు అధికార పక్షం తపన పడుతోంది.

రాబోయే కాలంలో తెలంగాణ రాజకీయాలు పూర్తిగా 'బీసీ సెంట్రిక్'గా మారే అవకాశం ఉంది. ఏ పార్టీ అయినా తన గెలుపు గుర్రాలను ఎంచుకునేటప్పుడు ఆయా నియోజకవర్గాల్లోని బీసీ జనాభా లెక్కలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

# తెలంగాణలో రాజ్యసభ పోరు..!

**మొదటిపేజీ తరువాయి**

టికెట్ల రేసులో ఆశావహుల సంఖ్య చాంతాడంత ఉండటం అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారు, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర నేతల కోసం తమ సీట్లను త్యాగం చేసిన వారు ఇప్పుడు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. సుమారు 20 మందికి పైగా సీనియర్ నేతలు ఈ రేసులో ఉన్నట్లు సమాచారం. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న వి.హనుమంతరావు, మాజీ మంత్రి జానారెడ్డి, జగ్గారెడ్డి వంటి ఉద్ధండులు ఈసారి తమకే అవకాశం దక్కుతుందని ఆశాభావంతో ఉన్నారు. వీరితో పాటు సామాజిక సమీకరణాల దృష్ట్యా బీసీ నేతలు కూడా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.



తెలంగాణ రాజ్యసభ ఎన్నికల్లో ఎప్పుడూ 'ఢిల్లీ' మార్కు నిర్ణయాలే కీలకం కానున్నాయి. గతంలో కూడా హైకమాండ్ జాతీయ స్థాయి నేతలను ఇక్కడి నుంచి పెద్దల సభకు పంపిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఖాళీ అవుతున్న స్థానాల్లో ఒకటి ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీది. ఆయనను తిరిగి తెలంగాణ నుంచే పంపాలని అధిష్టానం యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ సింఘ్వీకి ఒక సీటు కేటాయిస్తే, మిగిలిన ఒక్క సీటు కోసం రాష్ట్ర స్థాయి నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొనడం ఖాయం. స్థానిక నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుతున్నా, తుది నిర్ణయం మాత్రం హైకమాండ్ చేతుల్లోనే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ ఎంపిక ఒక కత్తిమీద సాము వంటిదే. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించాల్సి ఉంటుంది. రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తారా లేక బీసీ, ఎస్సీ వర్గాలకు అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీలో అసమ్మతి రాకుండా, అందరినీ సంతృప్తి పరుస్తూ అభ్యర్థులను ఖరారు చేయడం రేవంత్ వ్యూహచతురతకు పరీక్షగా నిలవనుంది. ముఖ్యంగా సీనియర్లు అలగకుండా చూసుకోవడం ఇప్పుడు రాష్ట్ర నాయకత్వానికి ఉన్న అతి పెద్ద సవాలు.

బీఆర్ఎస్ వైఖరి కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. సంఖ్యాబలం లేనప్పుడు పోటీకి దూరంగా ఉండటమే మేలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. గత పదేళ్లలో రాజ్యసభ సీట్లన్నీ గులాబీ దళానికే దక్కగా, ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నామినేట్ చేసే అభ్యర్థుల ఎన్నిక దాదాపు లాంఛనమే కానుంది. అభ్యర్థుల ప్రకటన వెలువడిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ ఊపందుకోనుంది. ఒకవేళ స్వతంత్రులు లేదా ఇతర అభ్యర్థులు బరిలో లేకపోతే, మార్చి నెలలోనే ఫలితం అధికారికంగా వెలువడనుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల్లో, రాజ్యసభ స్థానాల కోసం ఇంతటి పోటీ గతంలో ఎన్నడూ చూడలేదు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి గుర్తింపు దక్కాలని కేడర్ కోరుకుంటోంది. పార్లమెంటులో పార్టీ వాణిని బలంగా వినిపించే వారికే మొగ్గు చూపాలని అధిష్టానం భావిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు అవసరమైన నేతలను పంపడం ఒక కోణమైతే, రాష్ట్రంలో రాజకీయంగా పట్టు సాధించే నేతలను ఎంపిక చేయడం మరో కోణం. ఈ రెండింటి మధ్య సమన్వయం ఎలా సాగుతుందో వేచి చూడాలి.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మార్చి 16న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం ఫలితాలను ప్రకటిస్తారు. ఈ లోపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, బీఫారాలు అందజేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. సాధ్యమైనంత వరకు వివాదరహితంగా, ఏకగ్రీవంగా ఈ ఎన్నికలను ముగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల అసెంబ్లీలో అనవసరపు రాజకీయ వేడి తగ్గుతుందని భావిస్తున్నారు.

ముఖ్యంగా ఈ రెండు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరడం వల్ల పార్లమెంటు ఎగువ సభలో పార్టీ బలం స్వల్పంగా పెరుగుతుంది. జాతీయ రాజకీయాల్లో కూడా ఇది కాంగ్రెస్‌కు ఊపునిచ్చే అంశం. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే నేతలు ఇక్కడి సమస్యలను ఢిల్లీ స్థాయిలో ఎలా వినిపిస్తారనేది ముఖ్యం. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే గొంతుకలకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ సమాజం కోరుకుంటోంది. మొత్తానికి, మార్చి 16న జరిగే ఈ ఎన్నికలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఉత్తేజాన్ని నింపనున్నాయి. అభ్యర్థుల ఎంపికలో రేవంత్ రెడ్డి మార్కు కనిపిస్తుందా లేక అధిష్టానం మొగ్గు చెల్లుతుందా అన్నది మరికొద్ది రోజుల్లోనే స్పష్టం కానుంది. ఏది ఏమైనా, తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లే ఆ ఇద్దరు నేతలు ఎవరన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ పరిణామం రాబోయే లోక్‌సభ ఎన్నికలకు ఒక దిక్సూచిగా మారే అవకాశం ఉంది.

## ఆర్య వైశ్య కార్పొరేషన్ లోగో ఆవిష్కరణ










**అభినందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ అధికారిక లోగోను బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ , బెల్దే శ్రీధర్ , ఆకుల రమాకాంత్ , సరాపు సంతోష్ , బచ్చు చైతన్య , పార్సి ప్రకాష్ , దారం సతీష్ , నల్మాస్ దేవేందర్, రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మార్చి నెలలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన శ్రీ వాసవీ మహా శక్తి మహోత్సవం...సామూహిక పారాయణ కార్యక్రమం గురించి కల్వ సుజాత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు తెలిపారు . సుమారు 45 వేల మంది హాజరయ్యే ఈ కార్యక్రమం గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించబోతోందని వివరించారు. దానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాతను, నిర్వాహకులను అభినందించారు.

# ఐటీ కలలకు 'టవర్' సెగ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని టైర్ II నగరాలను ఐటీ హబ్‌లుగా తీర్చిదిద్ది, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే సమున్నత లక్ష్యం ప్రస్తుతం నీరుగారిపోతోంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఐటీ టవర్లు ఇప్పుడు కేవలం కాంక్రీట్ కట్టడాలుగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం నల్గొండ, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లో ఐటీ విస్తరణ ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని భావించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అంతర్జాతీయ కంపెనీలు వస్తాయని, వేల సంఖ్యలో నిరుద్యోగులకు కొలువులు దక్కుతాయని చేసిన ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా టైర్ II పట్టణాల్లో సుమారు 25,000 ఐటీ ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ప్రస్తుత గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్దేశించిన లక్ష్యంలో కనీసం పది శాతం మందికి కూడా ఉపాధి లభించకపోవడం గమనార్హం. ప్రారంభోత్సవాల సమయంలో ఆర్భాటంగా నిర్వహించిన జాబ్ మేళాలు యువతలో భారీ ఆశలు రేకెత్తించినా, ఆ తర్వాత వచ్చిన కంపెనీలు నామమాత్రమే. ముఖ్యంగా నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఐటీ టవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. నిపుణులైన యువతకు సరైన వేదిక దొరకక, వారు మళ్లీ మెట్రో నగరాల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




నల్గొండ జిల్లా కేంద్రంలో సుమారు 95 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన ఐటీ టవర్ ఒకప్పుడు అభివృద్ధికి చిహ్నంగా కనిపించింది. ఐదు అంతస్తుల్లో, 75 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో ఈ భవనాన్ని 2023లో ప్రారంభించారు. ప్రతి షిఫ్టులోనూ 2,000 మంది పనిచేసే సామర్థ్యం ఉందని అధికారులు ప్రగల్భాలు పలికారు. కానీ నేడు అక్కడ పనిచేస్తున్న వారి సంఖ్య 200 దాటకపోవడం శోచనీయం. ఇక్కడ కొలువుదీరిన సంస్థలు కూడా ఉన్నత స్థాయి సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కంటే, తక్కువ వేతనాలతో కూడిన డేటా ప్రాసెసింగ్ వంటి పనులకే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

ప్రభుత్వాలు మారినా ఐటీ టవర్ల దశ మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నల్గొండ ఐటీ టవర్‌ను టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థకు అప్పగించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. అయితే ఈ ప్రకటన వెలువడి ఏడాది గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు. టీసీఎస్ వంటి పెద్ద సంస్థలు వస్తేనే ఇక్కడ ఐటీ వాతావరణం ఏర్పడుతుందని, లేదంటే ఈ భారీ భవనం నిరుపయోగంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో పరిస్థితి మరీ అగమ్యగోచరంగా ఉంది. కనీసం సొంత భవనం కూడా లేకపోవడంతో పాత కలెక్టరేట్ అద్దె భవనంలోనే ఐటీ టవర్‌ను ప్రారంభించారు. ఐటీ కార్యకలాపాలకు కనీస సౌకర్యాలు లేని ఆ భవనంలో సంస్థలు ఎలా పనిచేస్తాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రారంభంలో 600 మందికి ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం అక్కడ ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా కార్యకలాపాలు సాగించడం లేదు. దీంతో స్థానిక యువతకు సొంత జిల్లాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడాలనే కల కలగానే మిగిలిపోయింది. ఆర్థికంగా చూస్తే ఈ ఐటీ టవర్లు తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థకు గుదిబండగా మారాయి. వీటిని నిర్వహించడానికి ప్రతి నెలా లక్షలాది రూపాయలు కరెంటు బిల్లులు, నిర్వహణ ఖర్చుల రూపంలో వెచ్చించాల్సి వస్తోంది. మరోవైపు కంపెనీల నుంచి వచ్చే అద్దె ఆదాయం చాలా తక్కువగా ఉంది. భవనం నిండుగా కంపెనీలు లేకపోవడంతో వీటిని 'వైట్ ఎలిఫెంట్స్' (తెల్ల ఏనుగులు) గా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఆదాయం లేని ఆస్తుల వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పెరుగుతోంది తప్ప, ఆశించిన ప్రయోజనం అందడం లేదు.

ఒక ప్రాంతంలో ఐటీ రంగం నిలదొక్కుకోవాలంటే కేవలం భవనాలు ఉంటే సరిపోదని విశ్లేషకులు చెబుతున్నారు. నగరంలో ఉండాల్సిన సామాజిక జీవన పరిస్థితులు, వినోద సాధనాలు, నిరంతర విద్యుత్, వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయాలతో పాటు ఐటీ అనుబంధ సేవలు అందుబాటులో ఉండాలి. జిల్లా కేంద్రాల్లో ఇలాంటి 'ఎకో సిస్టం' లేకపోవడమే కంపెనీలు వెనుకాడటానికి ప్రధాన కారణం. పెద్ద కంపెనీలు రాకపోవడంతో చిన్న కంపెనీలు కూడా తమ కార్యకలాపాలను కొనసాగించడానికి ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా జిల్లా స్థాయి ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయి. స్థానిక యువత ఆశలు నిరాశలవుతున్నాయి అనడానికి నల్గొండకు చెందిన పి. సురేష్ కుమార్ ఉదాహరణ. ఇంజనీరింగ్ పూర్తి చేసి తన సొంత ఊరిలోనే ఉద్యోగం వస్తుందని ఆశపడ్డ ఆయన, టవర్‌లో సరైన అవకాశాలు లేక చివరికి హైదరాబాద్‌కే వలస వెళ్లాల్సి వచ్చింది. జిల్లా ఐటీ టవర్లలో కేవలం సాధారణ డేటా ఎంట్రీ ఉద్యోగాలు తప్ప, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి మేధోపరమైన పనులు లేకపోవడంతో నైపుణ్యం కలిగిన యువత ఇక్కడ ఉండటానికి ఇష్టపడటం లేదు.

# 'వడ్డీతో సహా చెల్లిస్తాం'

**మొదటిపేజీ తరువాయి**

బలప్రయోగంతో అధికార పీఠాలను దక్కించుకోవాలనుకోవడం కాంగ్రెస్ నైజమని, అందులో భాగంగానే సుమన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని ఆయన విమర్శలు గుప్పించారు.



ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, చేస్తున్న ప్రతి తప్పుకు భవిష్యత్తులో జవాబు చెప్పుకోవాల్సి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా గుర్తించి తమ పద్ధతి మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఎక్కువ కాలం సాగవని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని కేటీఆర్ ప్రత్యక్షంగా ఆరోపణలు చేశారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ, అక్రమ మార్గాల్లో పదవులను పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని ఆయన విమర్శించారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై లేనిపోని అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారని ఆయన ఆరోపించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు ఇప్పటికే తమ నిరసనను తెలియజేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. స్థానికంగా ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి ప్రభుత్వ తీరును ఎండగట్టినా, ఈ ప్రభుత్వానికి ఏమాత్రం బుద్ధి రాలేదని ఆయన విమర్శించారు. ప్రజల గొంతుకను అణచివేయడం వల్ల అధికారం సుస్థిరం కాదని, ప్రజాగ్రహం ముందు ఏ ప్రభుత్వమైనా తలవంచక తప్పదని ఆయన అన్నారు. క్యాతన్‌పల్లి ప్రజల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. కొందరు పోలీసు అధికారులు చట్టాన్ని గౌరవించకుండా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. యూనిఫాం వేసుకున్న పోలీసులు రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలి తప్ప, పాలకుల కనుసన్నల్లో ప్రతిపక్షాలపై దాడులకు దిగకూడదని ఆయన హితవు పలికారు. పోలీసుల తీరుపై తాము నిశితంగా గమనిస్తున్నామని, తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు అరాచక పాలనను తలపిస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అభివృద్ధిని గాలికొదిలేసి, ప్రతిపక్ష నాయకులను వేధించడమే ఏకైక ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఆయన విమర్శించారు. బాల్క సుమన్ లాంటి బలమైన నేతలను జైలుకు పంపడం ద్వారా బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేరని ఆయన స్పష్టం చేశారు. అరెస్టులు, కేసులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన పోరాటం మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నాయకులను అదుపులోకి తీసుకోవడం పౌర హక్కులను కాలరాయడమేనని ఆయన అన్నారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమన్ అరెస్టును నిరసిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టపరంగా కూడా ఈ అన్యాయాన్ని ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని కేటీఆర్ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రజల దృష్టి మరల్చడానికి ఇలాంటి అరెస్టుల డ్రామాలు ఆడుతోందని ఆయన ఎద్దేవా చేశారు.

# నేలమ్మ ఒడిలో నడక..!

**మొదటిపేజీ తరువాయి**

చెప్పుల్లేకుండా ఒట్టికాళ్లతో నేలపై, పచ్చటి గడ్డిపై నడిపించడం వల్ల వారి ఆరోగ్యానికి, మేధస్సుకు బోలెడన్ని లాభాలు చేకూరుతాయని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. నేటి కాలంలో చిన్న వయసులోనే కళ్లద్దాలు ధరించే పిల్లల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికి గంటల తరబడి గ్యాడ్జెట్ల ముందు గడపడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం ప్రధాన కారణాలని అందరికీ తెలిసినవే. అయితే వీటితో పాటు ప్రకృతికి దూరమవ్వడం కూడా ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. చిన్నారులు నడక నేర్చుకున్న సమయం నుంచే వారిని చెప్పుల్లేకుండా పచ్చటి గడ్డిపై నడిపిస్తే కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. మన పాదాల్లో కంటికి అనుసంధానమైన అనేక నాడుల కేంద్రాలు (ప్రెజర్ పాయింట్స్) ఉంటాయి. నేలపై నడుస్తున్నప్పుడు సహజంగానే ఆ పాయింట్లపై ఒత్తిడి పడి, కళ్లకు రక్తప్రసరణ వేగవంతమవుతుంది. అలాగే కంటిలోని కండరాలు పచ్చదనాన్ని చూడటం వల్ల విశ్రాంతి పొంది దృష్టి లోపాలు రాకుండా కాపాడుతాయి. కేవలం శారీరక ఆరోగ్యమే కాదు, మేధో వికాసంలోనూ భూస్పర్శ కీలక పాత్ర పోషిస్తుంది. చెప్పులు ధరించి పెరిగే పిల్లల కంటే, ఒట్టికాళ్లతో నేలపై తిరిగే పిల్లల్లో మేధస్సు అత్యంత చురుగ్గా ఉంటుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. పాదాల అడుగు భాగంలో మెదడుకు సంకేతాలు పంపే నాడీ వ్యవస్థలు నిక్షిప్తమై ఉంటాయి. నేలపై ఉండే చిన్నపాటి గరుకుతనం లేదా చల్లదనం నేరుగా మెదడును ప్రేరేపిస్తాయి. దీనివల్ల ఆలోచనా సామర్థ్యం పెరగడమే కాకుండా, జ్ఞాపకశక్తి కూడా అద్భుతంగా మెరుగుపడుతుంది. పిల్లలను రకరకాల ఉపరితలాలపై అంటే మట్టిలో, ఇసుకలో, గడ్డిలో నడిపించడం వల్ల వారి నరాల వ్యవస్థ చురుగ్గా మారి కొత్త విషయాలను త్వరగా గ్రహించే శక్తిని సంతరించుకుంటారు.

మానసిక ప్రశాంతతకు, ఆనందానికి మూలమైన 'హ్యాపీ హార్మోన్లు' అనబడే ఎండార్ఫిన్లు విడుదల కావడానికి ప్రకృతి సిద్ధమైన నడక దోహదపడుతుంది. పిల్లలు రోజూ కాసేపు ఆరుబయట చెప్పుల్లేకుండా ఆడుకోవడం వల్ల వారి మనసులోని ఆందోళనలు, భయాలు తొలగిపోతాయి. మట్టితో ఆడుకోవడం ద్వారా వచ్చే అనుభూతి వారిలో ఉత్సాహాన్ని నింపుతుంది. చిన్ననాటి నుంచే ఇలాంటి అలవాట్లు ఉండటం వల్ల భవిష్యత్తులో వచ్చే ఒత్తిడిని తట్టుకునే మానసిక స్థయిర్యం వారికి లభిస్తుంది. ఆధునిక కాలంలో పిల్లలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలకు భూమిపై ఒట్టికాళ్లతో నడవడం ఒక చక్కని సహజ చికిత్సలా పనిచేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

నేటి తరం పిల్లల్లో మరో ప్రధాన సమస్య సరైన నిద్ర లేకపోవడం. స్కూల్ పనిభారం, టీవీలు, మొబైల్ ఫోన్ల ప్రభావంతో వారి నిద్ర సమయాలు గందరగోళంగా మారుతున్నాయి. ఇది వారి శారీరక ఎదుగుదలను మందగింపజేస్తుంది. ఈ సమస్యను అధిగమించాలంటే పిల్లలను సాయంత్రం వేళల్లో కనీసం అరగంటపాటు ఒట్టికాళ్లతో గడ్డిపై నడిపించాలి. ఈ ప్రక్రియ వల్ల శరీరంలోని హార్మోన్లు సమతుల్యత సాధిస్తాయి. రోజంతా పేరుకుపోయిన అలసట దూరమై, రాత్రి పూట గాఢ నిద్ర పట్టడానికి మార్గం సుగమమవుతుంది. క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల నిద్రలేమి సమస్యలు తొలగిపోయి, పిల్లలు ఉదయాన్నే మరింత ఉత్సాహంగా నిద్రలేస్తారు. ప్రతికూల ఆలోచనలు కేవలం పెద్దవారికే కాదు, నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు కూడా ఎదురవుతున్నాయి. చిన్నారుల్లో సానుకూల దృక్పథాన్ని నింపడానికి 'ఎర్థింగ్' ప్రక్రియ ఎంతో మేలు చేస్తుంది. మనం చెప్పుల్లేకుండా నేలపై నడిచినప్పుడు భూమిలోని పాజిటివ్ ఎలక్ట్రాన్లు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. అదే సమయంలో శరీరంలో ఉన్న నెగెటివ్ ఎలక్ట్రాన్లను భూమి గ్రహిస్తుంది. ఈ శక్తి మార్పిడి వల్ల పిల్లల్లో ఆవేశం తగ్గి, ఓర్పు పెరుగుతుంది. ప్రతి విషయాన్ని సానుకూలంగా చూసే గుణం వారిలో అలవడుతుంది. దీనివల్ల సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో, క్లిష్ట పరిస్థితుల్లో ఎలా ప్రశాంతంగా ఉండాలో వారు సహజంగానే నేర్చుకుంటారు.

పిల్లల పాదాల ఆకృతి సరిగ్గా ఏర్పడటానికి కూడా చెప్పుల్లేకుండా నడవడం అవసరం. చిన్నప్పుడు నిరంతరం షూలు ధరించడం వల్ల పాదాల వంపు సరిగ్గా ఏర్పడక 'ఫ్లాట్ ఫీట్' వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒట్టికాళ్లతో నడిచినప్పుడు పాదాల్లోని కండరాలు, స్నాయువులు బలోపేతమవుతాయి. ఇది వారి నడకను స్థిరంగా మార్చడమే కాకుండా, భవిష్యత్తులో వెన్నుపూస సంబంధిత సమస్యలు రాకుండా కాపాడుతుంది. సహజ సిద్ధమైన ఉపరితలాలపై అడుగులు వేయడం వల్ల శరీర సమతుల్యత మెరుగ్గా ఉంటుంది. ఇది క్రీడల్లోనూ, ఇతర శారీరక శ్రమతో కూడిన పనుల్లోనూ పిల్లలకు ఎంతో సహాయకారిగా మారుతుంది. చిన్నారులను బయటకు పంపేటప్పుడు మట్టి అంటుతుందనే భయం వద్దు. మట్టిలో ఉండే కొన్ని రకాల మేలు చేసే బ్యాక్టీరియా పిల్లల రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి సహకరిస్తాయి. అతిగా శుభ్రంగా ఉంచడం వల్ల వారిలో రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంది. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే అంత దృఢమైన ఆరోగ్యం వారి సొంతమవుతుంది. అయితే పిల్లలు నడిచే ప్రదేశం సురక్షితంగా ఉండేలా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. పదునైన రాళ్లు, గాజు ముక్కలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు లేని పచ్చటి పార్కులు లేదా సొంత పెరడులో వారిని స్వేచ్ఛగా నడవనివ్వాలి.

ఈ అలవాటును కేవలం సెలవు రోజుల్లోనే కాకుండా దైనందిన జీవితంలో భాగంగా మార్చాలి. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం కాసేపు సమయం కేటాయించి పిల్లలతో కలిసి తల్లిదండ్రులు కూడా ఈ విధంగా నడవాలి. దీనివల్ల పిల్లలకు స్ఫూర్తి కలగడమే కాకుండా, పెద్దలకు కూడా రక్తపోటు తగ్గడం, మనసు ప్రశాంతంగా ఉండటం వంటి లాభాలు కలుగుతాయి. పిల్లలకు చిన్ననాటి నుంచే ప్రకృతితో మమేకమయ్యే అవకాశం కల్పిస్తే, వారు ఆరోగ్యవంతులుగా మాత్రమే కాకుండా సున్నిత మనస్తత్వం గల బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. నేటి ఆధునిక ప్రపంచంలో గ్యాడ్జెట్ల చెర నుంచి వారిని విడిపించి ప్రకృతి ఒడిలోకి పంపడం అత్యవసరం.



GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

## గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్లు విధులు బహిష్కరణ




**విశాలభారతి,, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కి చెందిన మార్కాపురి తిలక్ అనే న్యాయ వాదిపై అకారణంగా వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, అతని గన్ మెన్ ప్రవీణ్ దాడి చేసి, దుర్భాషలాడిన సంఘటనపై గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్లు విధులు బహిష్కరించారు. ఈనెల 10న రాత్రి స్థానిక ఎల్బీనగర్ లో అడ్వకేట్ తిలక్ ను పోలీసులు అడ్డుకుని అతని దగ్గర ఉన్న నగదు, సెల్ ఫోన్, బైకు లాక్కున్నారు. అతని దగ్గర ఉన్న 47,500 నగదును తీసుకున్నారు. అంతేగాకుండా దాడి చేసి, దుర్భాషలాడినట్లు తిలక్ పేర్కొన్నారు. ఈ సంఘటనపై పట్టణ బార్ అసోసియేషన్ ప్రతినిధులు గత 4 రోజుల నుంచి విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ విషయంలో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని అంటున్నారు. అకారణంగా దాడి చేసిన సిఐ, అతని గన్ మెన్, రిటర్నింగ్ అధికారిపై సదరు అడ్వకేట్లు రామగుండం పోలీసులు కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.అక్కడ నుంచి స్పందన లేకపోవడంతో లాయర్లు బుధవారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై కోర్టులో ప్రైవేటు పిటిషన్ వేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో మార్కాపురి తిలక్, బాధిత అడ్వకేట్, తౌవుటం సతీష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు. సంజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి. శైలజ, అడ్వకేట్ తదితరులు లాయర్లు పాల్గొన్నారు.

## సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**విద్యార్థులు సైన్స్ పై మక్కువ పెంచుకోవాలి..ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు**



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం కేంద్రం లో జడ్పీఎస్ఎస్ ఎస్ఎస్ వాజేడు నాగారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైన్స్ పై మక్కువ పెంచుకోవాలని వాజేడు మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఎనిమిది తొమ్మిది తరగతులు చదివే విద్యార్థులందరికీ ఆన్లైన్లో భౌతిక శాస్త్ర విభాగంలో టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటేశ్వరరావు హాజరై ఆన్లైన్ పరీక్షలో పాటించాల్సిన నియమాలను గురించి సూచించారు. విద్యార్థులు సైన్స్ పై మక్కువ పెంచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు జిల్లాస్థాయిలో 23 న జరిగే టాలెంట్ టెస్ట్ లో వాజేడు మండలం పేరు నిలబెట్టాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు విద్యార్థి దశలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకెళ్లాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు అన్నారు. అనంతరం టాలెంట్ లో ప్రతిభ కనబరిచిన చిగురు మహేష్, జ్యోతి , లోకేష్ లను మండల విద్యాశాఖ అధికారి తో కలిసి అభినందించారు కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ వాజేడు నాగారం కేజీబీవీ వాజేడు,ఆశ్రమ పాఠశాల పేరూరు, పెద్ద గొల్లగూడెం ,జడ్.పి.హెచ్.ఎస్ ధర్మవరం పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు



**విశాలభారతి, రామగిరి:** పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా గోదావరిఖని, సుందిల్లలోని పురాతనమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు, పి.వి. శ్రీనివాసరావు, దేశాల భూపాల్,మొహసిన పర్వీన్,బోరెడ్డి అయోధ్య రెడ్డి లతో పాటు అర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం గోదావరిఖని అర్జీ వన్ ఏరియాలోని 2ఏ భూగర్భ బొగ్గు గనిని మరియు ఓ.సి 5 సందర్శనలో అర్జీవన్ జి.యం వారికీ ఉద్యోగుల పని విధివిదానాలు, బొగ్గు ఉత్పత్తి తరలించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు.జి.యం.కె.చంద్రశేఖర్, ఏ.జి. యం.ఎ.ఆంజనేయులు, సి యం ఒ ఏ ఐ జనరల్ సెక్రెటరి కె.మల్లేశం, ప్రాజెక్ట్ ఆఫిసర్ డి.రమేష్, ఏజెంట్ డి.రమేష్, మేనజర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్ వితరణ



**తిరుమలగిరి, విశాలభారతి:** తిరుమలగిరి మున్సిపాలిటీ లోని 13 వార్డు లో గల ప్రాథమిక పాఠశాలలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ ను అందజేయజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛమైన నీరు త్రాగడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శాంతయ్య, ఉపాధ్యాయులు ఉపేందర్, నాగమ్మ మరియు జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దుబ్బాక అశోక్ గౌడ్, గిలకత్తుల వెంకన్న గౌడ్, మండల నాయకులు గంట లక్ష్మణ్,గంట సాల్మన్, గంట సంపత్, ఉదయ్, నరేందర్, వరుణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ**

**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం కార్పొరేటర్ల సమన్వయంతో డివిజన్ లో ప్రజలకు మరింత మెరుగైన మునిసిపల్ సేవలు అందించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ,రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ వార్డు అధికారులకు , సిబ్బందికి సూచించారు . ఈ మేరకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్లు దృష్టికి తెచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరి కొద్ది రోజులే గడువు ఉన్నందున ఆస్తి పన్ను , నల్లా బిల్లు , ట్రేడ్ లైసెన్స్ రుసుం బకాయల వసూళ్ల లో వేగం పెంచాలని అన్నారు. అమృతమ్ యాప్ లో వివరాల నమోదు , ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ , మెప్మా ఎస్ ఎల్ ఎఫ్ ల ఎన్నికలు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శాంతి స్వరూప్ , షాభాజ్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ భార్యను కిరాతకంగా చంపిన టెకీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**





హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం పట్టపగలు సభ్యసమాజం తల దించుకునేలా ఒక కిరాతక ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్య అన్న కనికరం లేకుండా, విడాకులు తీసుకున్న కోపంతో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన మాజీ భార్యను అత్యంత క్రూరంగా అంతం చేశాడు. స్థానిక గ్రీన్‌సిటీ కాలనీలో జరిగిన ఈ దారుణం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. నిందితుడు మహేష్ తన మాజీ భార్య సునీతను పథకం ప్రకారం హత్య చేసిన తీరును చూసి పోలీసు అధికారులు సైతం విస్తుపోయారు.

వివరాల్లోకి వెళ్తే, సునీత అనే టెకీకి, మహేష్‌కు సుమారు ఐదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్లయిన కొత్తలో వీరి సంసారం సాఫీగానే సాగినా, కాలక్రమేణా దంపతుల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. మహేష్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నప్పటికీ, భార్యాభర్తల మధ్య విభేదాలు తగ్గలేదు. చిన్నపాటి కారణాలతో ప్రారంభమైన గొడవలు చివరకు కోర్టు మెట్లెక్కే వరకు వెళ్లాయి. పరస్పర అంగీకారంతో వీరిద్దరూ ఇటీవల చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఇరువురు విడివిడిగా ఉంటున్నారు.

విడాకుల అనంతరం సునీత తన జీవితాన్ని కొత్తగా ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే ఆమె మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అయితే సునీత రెండో పెళ్లి చేసుకుందన్న వార్త విన్న మహేష్ మనసులో తీవ్రమైన అక్కసును పెంచుకున్నాడు. తనను కాదని వేరొకరితో జీవితాన్ని పంచుకోవడం అతడు జీర్ణించుకోలేకపోయాడు. అప్పటి వరకు విదేశాల్లో ఉన్న మహేష్, ఎలాగైనా ఆమెను అంతం చేయాలని కక్ష పెంచుకుని నగరానికి చేరుకున్నాడు. క్రూరమైన ఆలోచనతో ఒక పథకాన్ని రచించుకుని నేరుగా ఆమె నివసిస్తున్న గ్రీన్‌సిటీ కాలనీలోని ఇంటికి వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం మహేష్ వెంట కత్తులు, పెట్రోల్ బాటిల్‌ను సిద్ధం చేసుకుని సునీత నివాసానికి చేరుకున్నాడు. ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే ఆమెతో గొడవకు దిగాడు. పాత విషయాలను గుర్తు చేస్తూ తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగాడు. తాను ఎంతగానో ప్రేమిస్తున్నానని చెప్పుకుంటూనే, తనను కాదని మరో పెళ్లి ఎలా చేసుకుంటావంటూ నిలదీశాడు. గొడవ పెద్దది కావడంతో ఆగ్రహంతో ఊగిపోయిన మహేష్, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేయడం ప్రారంభించాడు. శరీరంపై ఎక్కడ పడితే అక్కడ కత్తితో పొడవడంతో సునీత తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా మహేష్ కసి తీరలేదు. రక్తపు మడుగులో ఉన్న ఆమె తలపై పెరట్లో ఉన్న బరువైన పూలకుండీలతో బాదాడు. తల పగిలి మెదడు బయటకు వచ్చేంతగా క్రూరంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆ అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు భయంతో బయటకు పరుగెత్తుకొచ్చారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారు ఇంటి వద్దకు చేరేసరికి సునీత విగతజీవిగా పడి ఉంది.

ఘటనా స్థలిలో దృశ్యం అత్యంత భీతావహంగా మారింది. సునీత ప్రాణాలు కోల్పోయినప్పటికీ మహేష్ అక్కడే నిలబడి ఉన్నాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన వనస్థలిపురం పోలీసులు నిందితుడిని ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తులను, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సునీత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో కాలనీ అంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. విచారణలో నిందితుడు మహేష్ తన నేరాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. తనను మోసం చేసి వేరే వ్యక్తిని పెళ్లి చేసుకున్నందుకే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అతడు పోలీసుల ముందు వెల్లడించినట్లు సమాచారం. సునీత ప్రస్తుత భర్త ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, లేదంటే అతడిపై కూడా దాడి జరిగే అవకాశం ఉండేదని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన పోలీసులు నిందితుడిపై హత్య కేసు నమోదు చేశారు.

పట్టపగలు జనసంచారం ఉన్న ప్రాంతంలో ఇలాంటి దారుణం జరగడం స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వ్యక్తి, ఇంతటి క్రూరత్వానికి పాల్పడటం గమనార్హం. విడాకుల తర్వాత ఇద్దరికీ సమాన హక్కులు ఉంటాయని, జీవితాన్ని ఎవరికి నచ్చినట్లు వారు గడుపుకోవచ్చని కనీస జ్ఞానం లేకపోవడం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, నిందితుడి జీవితాన్ని కూడా జైలు పాలు చేసింది. పోలీసులు క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. హత్యకు ముందు మహేష్ ఎక్కడెక్కడ తిరిగాడు, కత్తులను ఎక్కడ కొనుగోలు చేశాడు అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. అలాగే పెట్రోల్ ఎందుకు తీసుకువచ్చాడు అనే అంశంపై కూడా ఆరా తీస్తున్నారు. ఆమెను చంపి శవాన్ని దహనం చేయాలని ఏమైనా ప్లాన్ చేశాడా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ దారుణ హత్య నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఆవేశం, పగ మనిషిని ఏ స్థాయికి దిగజారుస్తాయో ఈ ఘటన నిరూపిస్తోంది. ఐదేళ్ల వివాహ బంధం విడిపోయిన తర్వాత కూడా పాత కక్షలను మనసులో ఉంచుకుని నిందితుడు చేసిన ఈ పనిని మహిళా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. సునీత కుటుంబ సభ్యులు ఆమె మరణవార్త విని శోకసముద్రంలో మునిగిపోయారు. దోషికి కఠిన శిక్ష పడేలా చూడాలని వారు పోలీసులను కోరుతున్నారు.

## 'హర్ వాయిస్'తో బాలికల్లో నాయకత్వ వికాసం

**మహబూబాబాద్, విశాలభారతి:**



వాయిస్ 4 సంస్థ చేపట్టిన 'హర్ వాయిస్' కార్యక్రమం ముత్యాలమ్మగూడెం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విజయవంతంగా కొనసాగుతోంది. వెనుకబడిన వర్గాలకు చెందిన యవ్వన బాలికల్లో ఆత్మవిశ్వాసం, స్వయంప్రతిపత్తి మరియు నాయకత్వ గుణాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాఠశాలలో నిర్వహించిన శిక్షణా శిబిరంలో 160 మంది బాలికలు పాల్గొని మార్పు దిశగా అడుగులు వేశారు. ఆనందభరితమైన అభ్యాస పద్ధతులు, చర్చలు, పాత్రాభినయాలు వంటి కార్యాచరణల ద్వారా విద్యార్థినులు తమలోని సంకోచాన్ని విడిచిపెట్టి, ధైర్యంగా అభిప్రాయాలను వ్యక్తపరచడం నేర్చుకున్నారు. కార్యక్రమంలోని చివరి దశ అయిన 'సఖి పీర్ లీడర్‌షిప్'లో పాల్గొన్న బాలికలు తమ సహచరులకు మార్గదర్శకులుగా మారే విధంగా శిక్షణ పొందుతున్నారు. 2024-2025, విద్యా సంవత్సరంలో 256 మందికి పైగా బాలికలు 'సఖి'లుగా ఎంపికై నాయకత్వ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినుల్లో సమర్థవంతమైన సంభాషణా నైపుణ్యాలలో 38.5 శాతం పెరుగుదల నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు. సంస్థ స్థాపకురాలు అనుషా భరద్వాజ్ మాట్లాడుతూ, "సిగ్గుతో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు నాయకత్వ దిశగా మారింది. బాలికలు తమ హక్కుల కోసం ధైర్యంగా మాట్లాడుతున్నారు. కుటుంబాల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు ముందడుగు వేస్తున్నారు" అని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి డి. కోటేశ్వరి మాట్లాడుతూ, 8వ మరియు 9వ తరగతి విద్యార్థినులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని, ఇంతకుముందు నిర్వహించిన పరిచయ్, దిశా శిబిరాలు కూడా మంచి ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. 'హర్ వాయిస్' కార్యక్రమం పరిచయ్, దిశా, సఖి పీర్ లీడర్‌షిప్ అనే మూడు దశల్లో, ప్రతి దశ 10 రోజులపాటు నిర్వహించబడుతుంది. బాలికల శరీర అవగాహన, భద్రత, హక్కులు మరియు భవిష్యత్ లక్ష్యాలపై సమగ్ర అవగాహన కల్పించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటి వరకు వాయిస్4 సంస్థ 3 లక్షలకు పైగా యవ్వన బాలికలు, బాలురు మరియు యువ మహిళల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువచ్చినట్లు వెల్లడించింది.

## అమరజీవి కామ్రేడ్ మల్లి సుజాత ఆశయాలను సాధిస్తాం


**ఎండి జాంగిర్ గారు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

**చౌటుప్పల్ విశాలభారతి:**



పట్టణ కేంద్రంలోని సిపిఎం పార్టీ నాయకురాలు మరియు సుజాత మరణ వార్తను తెలుసుకున్న సిపిఎం పార్టీ నాయకులు అక్కడకు విచ్చేసి ఘనంగా నివాళులర్పించారు.తదనంతరం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జాంగిర్ మాట్లాడుతూ...భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు స్థాపనలో మల్లి రామ్ రెడ్డి సతీమణి మల్లి సుజాత తో పాటు సిపిఎం పార్టీని నిర్మించడంలో మల్లి రామిరెడ్డి కి తోడుగా పని చేసిన మల్లి సుజాతక్క చౌటుప్పల్ మండలంలోని సుజాతక్క మహిళల హక్కుల కోసం మహిళల సమస్యల కోసం గ్రామ గ్రామాన మహిళా సంఘాలు ఏర్పాటు చేసి అనేక రకమైన పోరాటాలు చేసిన చరిత్ర సుజాతక్కది.అదేవిధంగా గీసేవానికి చెట్టు దున్నేవానికి భూమి పని చేసేవానికి కూలి భూస్వాములకు వ్యతిరేకంగా కందాల రంగారెడ్డి నాయకత్వన అనేక రకమైన పోరాటాలు చేసిన చరిత్ర,ఎర్రజెండా మసీదు గూడెం పేద ప్రజల అండగా ఎర్ర జెండాకు పేద ప్రజలకు అండదండగా ఉండేది.పార్టీ సభ్యులకు మసీదు గూడెం పోతే ఏ సమస్య అయిన పరిష్కారం అయితదని నమ్మకాన్ని పార్టీ సభ్యులకు భరోసా ఇచ్చిన కామ్రేడ్ సుజాతక్క ఆశయ సాధన కోసంకృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.ఈ కార్యక్రమానికి,బొంతల చంద్రారెడ్డి,మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి,జి.శ్రీనివాస్ చారి,జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా,గంగాదేవి సైదులు,గోశిక కరుణాకర్,అవ్వారి రామేశ్వరి,రాగిరి కిష్టయ్య,కోట రామచంద్రారెడ్డి,గడ్డం వెంకటేష్,సురకంటి శ్రీనివాస్ రెడ్డి,బండారు నరసింహ,గోషిక స్వామి,తుమ్మల నర్సిరెడ్డి,అవారి గోవర్ధన్,బత్తుల దాసు,కొండే శ్రీశైలం,యాట బాలరాజు,బొడ్డు అంజిరెడ్డి,ఎలక రాజు యాదగిరి,కస్తూరి లింగస్వామి,కందటి వంశీ తదితరులు పాల్గొనడం జరిగింది.

## నూతన చైర్ పర్సన్ కుసుమ బాబుకు ఘన సన్మానం



**కోదాడ, విశాలభారతి:** కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగవరపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో కోదాడ మునిసిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు దంపతులను బుధవారం ఘనంగా సన్మానించారు. నూతనంగా మునిసిపల్ చైర్ పర్సన్ భాధ్యతలు చేపట్టినందుకు ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు దంపతులను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుటుంబరావు, ఉప సర్పంచ్ మల్లెల ప్రసాద్, అమిరిష్ పురి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విధి దీపాలకు మరమ్మతులు

- 39వ డివిజన్ కార్పొరేటర్ తిప్పరపు మానస
- గోదావరిఖని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్



**విశాలభారతి, గోదావరిఖని:** రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్, శివాజీ నగర్ ప్రాంతంలోని మసీద్ వద్ద గత కొంతకాలంగా వీధి దీపాలు పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నరాని విషయం తెలుసుకున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ 39వ డివిజన్ కార్పొరేటర్ తిప్పారపు మానస దృష్టికి తీసుకోని వచ్చారు.ముఖ్యంగా రంజాన్ పుణ్య మాసంలో రాత్రి వేళల్లో నమాజ్‌కు వెళ్లే వాళ్ళు స్థానిక మహిళలు, వృద్ధులు, చిన్నారులు భద్రతా పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గుర్తించిన కార్పొరేటర్ వెంటనే స్పందించారు .ఈ సమస్యని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకునేలా చొరవ చూపారు. వారి నిరంతర ప్రయత్నాల ఫలితంగా మసీద్ పరిసర ప్రాంతాల్లో కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేసి, పాతవాటిని మరమ్మతులు చేయించడం జరిగింది. దీంతో రాత్రివేళల్లో వెలుతురు సమస్య పూర్తిగా తొలగిపోతుంది, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆకుల అరుణ్ ,శరత్, అంజాద్ , అంకుష్, కాజా పాల్గొని, స్థానికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంలో ఈ విధంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడం అభినందనీయమని స్థానికులు కార్పొరేటర్ కి, పట్టణ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కార దిశగా అడుగులు వేయడం ద్వారా 39వ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కట్టుబడి ఉందని ఈ సంఘటన మరోసారి రుజువు చేయబడింది.

## మృతురాలి కుటుంబానికి గ్రామ పాలకవర్గం ఆర్థిక సాయం

**అందజేసిన సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్.. ఉప సర్పంచ్ అనూఫ్ రెడ్డి**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని దేవులమ్మ నాగారం గ్రామానికి చెందిన నీటీ సరఫరాదారుడు రాములు భార్య యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్,ఉప సర్పంచ్ అనుఫ్ రెడ్డి మరియు పాలకవర్గ సభ్యులు కలిసి బాధితుడు రాములు కుటుంబాన్ని పరామర్శించారు.తదనంతరం యాదమ్మ అంతక్రియల ఖర్చుల నిమిత్తం గ్రామ పంచాయతీ తరపున 20 వేల రూపాయలను సహాయంగా అందించారు.ఈ కార్యక్రమంలో ఆ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## రెవెన్యూ టైపిస్ట్‌ల సేవల కొనసాగింపుపై వినతి



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను నిలిపివేయాలన్న సీసీఎల్ఏ కార్యాలయం మెమో నేపథ్యంలో ఆందోళన నెలకొంది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే జిల్లాలో పనిచేస్తున్న సుమారు ఆరుగురు ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడనుంది. ఈ సమస్యపై టి ఆర్ ఈ ఎస్ఏ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు ఎన్నో సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో నిరంతరాయంగా సేవలు అందిస్తూ, పరిపాలనా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రతినిధులు వివరించారు. పత్రాల నమోదు, దస్త్రాల సంరక్షణ, భూమి సంబంధిత సమాచారం నమోదు వంటి పనుల్లో వీరి పాత్ర అత్యంత ముఖ్యమని తెలియజేశారు. అలాగే, వీరిలో చాలా మంది వయోపరిమితి దాటిపోయినందున ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయారని, అకస్మాత్తుగా సేవలు నిలిపివేస్తే వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృష్టితో వీరి సేవలను కొనసాగించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీసీఎల్ఏ కార్యాలయానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఈ ఉద్యోగుల భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కోదాడ్‌లో విజ్మోని 325వ బ్రాంచ్ ప్రారంభం




**కోదాడ, విశాలభారతి:** వైవిధ్య భరిత ఆర్థిక సేవల సంస్థ విజ్మోని (గతంలో యూనిమోని) కోదాడ్‌లో రంగా థియేటర్ సమీపంలో ని చంద్ర మౌలి కాంప్లెక్స్‌లో 325వ బ్రాంచ్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు.ఈ బ్రాంచ్ ను బుధవారం వైస్ ప్రెసిడెంట్ & జోనల్ హెడ్ టి. శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 32వ శాఖ కావడం విశేషం అన్నారు. కోదాడ అభివృద్ధికి రైతులు, చిన్న వ్యాపారులు కీలకమని, వారికి సులభమైన రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యమని శ్రీనివాస రెడ్డి తెలిపారు.బంగారు రుణాలు, విదేశీ మారకం, విదేశాలకు డబ్బు పంపిణీ, మల్టీ కరెన్సీ ట్రావెల్ కార్డులు, డిజిటల్ చెల్లింపులు, బీమా తదితర సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 300కు పైగా శాఖలతో సంస్థ వినియోగదారులకు విశ్వసనీయ ఆర్థిక పరిష్కారాలు కోసం కృషి చేస్తుందన్నారు.సంస్థ సి ఎస్ ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఎంపీపీ ఎస్ జి. ఆజాద్ నగర్‌కు ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రీజినల్ హెడ్ కె. వెంకట సుబ్బయ్య, బ్రాంచ్ హెడ్ వీరేందర్ జాటోత్ పాల్గొన్నారు.

## కోదాడ మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్‌లకు సన్మానం



**కోదాడ, విశాలభారతి:** ఎమ్మెల్యే పద్మావతి ఆశీస్సులతో నూతనంగా ఎన్నికైన కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరిని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులి సులోచన రావు. మాజీ సర్పంచ్ గద్దల వెంకటేశ్వర్లు. ఉత్తం సోషల్ మీడియా కోఆర్డినేటర్ గణపవరం 9వ వార్డు బండి చినకోటయ్య, పులి రాజారావు, బండి సత్యం పాల్గొన్నారు.

## టెక్నో గెలాక్సీ ఎగ్జిబిషన్‌లో ఎన్టిపిసి రామగుండం



**విశాలభారతి, ఎన్ టిపిసి:** 2026 ఫిబ్రవరి 13 నుండి 15 వరకు రాయ్‌పూర్‌లో జరిగిన ఓ, యం కాన్ఫరెన్స్ ఇండియన్ పవర్ స్టేషన్లు 2026 సందర్భంగా ఎన్ టి పి సి రామగుండం, తెలంగాణ బృందం టెక్నో గెలాక్సీ ఎగ్జిబిషన్‌లో పాల్గొంది. నాణ్యత , విశ్వసనీయతతో థర్మల్ జనరేషన్‌ను ఆప్టిమైజ్ చేయడం అనే థీమ్‌తో ఈ సమావేశం నిర్వహించబడింది. ఇండియన్ పవర్ స్టేషన్లు 2026లో ప్రదర్శన కోసం ఆర్ &టి నుండి మూడు మోడల్‌లు ఎంపికయ్యాయి. యం జి ఆర్ టీమ్ అభివృద్ధి చేసిన అబ్సొల్యూట్ బ్లాక్ సిస్టమ్, ఆర్ఎస్ టి పి ఎస్ మరియు ఎఫ్ యం టెసెట్‌ప్ సమర్పించిన బెల్టెడార్ఎక్స్ మోడల్‌పై ప్రత్యేక ప్రశంసలు లభించాయి. టెక్నో గెలాక్సీ అవార్డుల కింద దక్షిణ ప్రాంతం ఒకటో వ రన్నరప్‌గా ఎంపికైంది, ఇది సాంకేతిక నైపుణ్యం మరియు ఆవిష్కరణలకు ఈ ప్రాంతం యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.అని తెలియజేసారు.

## కాంగ్రెస్ నాయకుల కుట్రతోనే ఓటమి

**7వ వార్డు భీఆర్ఎస్ అభ్యర్థి కానుగు యాదమ్మ బాలరాజు**



**చౌటుప్పల్, విశాలభారతి:** కాంగ్రెస్ నాయకుల కుట్రతోనే చౌటుప్పల్ మున్సిపాలిటీ 7వ వార్డు కౌంటింగ్ లో ఓడిపోయానని చౌటుప్పల్ మున్సిపాలిటీ 7వ వార్డు భీఆర్ఎస్ అభ్యర్థి కానుగు యాదమ్మ బాలరాజు ఆరోపించారు.బుధవారం కానుగు యాదమ్మ బాలరాజు విలేకరులతో మాట్లాడాతూ..7వ వార్డు ఎన్నికల కౌంటింగ్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల అధికార దుర్వినియోగానికి పాల్పడడంతో తన ఓటమి జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల చేత న్యాయంగా ఎన్నుకోబడిన తనను కౌంటింగ్ శైలిలో అధికారులు మొదట ప్రకటించిన ఫలితాలలో తనను విజేతగా ప్రకటించారని పేర్కొన్నారు.తరువాత రికౌంటింగ్ లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినట్లు అధికారులు ప్రకటించారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు,రిటర్నింగ్ అధికారులతో కుమ్మక్కై బ్యాలెట్ పేపర్లు తారుమారు చేసి తనకు పడిన ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థికి పడినట్లు బ్యాలెట్ పేపర్లను మార్చారని ఆరోపించారు. మున్సిపాలిటీకి సంబంధంలేని కాంగ్రెస్ పార్టీ నాయకులను కౌంటింగ్ హాలు లోకి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఫలితం పై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. ఏడో వార్డు ఫలితం పై న్యాయస్థానమును ఆశ్రయించినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యమును అపహస్యం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె కోరారు.

## మహిళా విద్యార్థులు సీఎం కప్ కి ఎంపిక



**నల్గొండ, విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్2025 (సెకండ్ ఎడిషన్) లో భాగంగా,సాఫ్ట్ బాల్ అసోసియేషన్ నల్గొండ ద్వారా ఈ నెల 16 న మేకల అభినవ్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించబడ్డాయి.ఈ ఎంపికలో తెలంగాణ సాంఘిక సంక్షేమ నల్గొండ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.జయంతి,వి.సత్య శ్రీ,ఎం. నందిని ఫిబ్రవరి 20 నుండి 23 వరకు మెదక్ లో జరగనున్న సిఎం కప్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. అదేవిధంగా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నల్గొండ ఆధ్వర్యంలో ఈ నెల 17 న ఉదయం మేకల అభినవ్ స్టేడియం,నల్లగొండలో హ్యాండ్ బాల్ సెలెక్షన్స్ నిర్వహించబడినవి.ఈ ఎంపికలో ఈ.అంజలి,జై.కావ్య,పి. ధాత్రి,ఇ.యమున,ఎన్.నందిని విద్యార్థులు ఈ నెల 20 నుండి 23 వరకు యల్ బి స్టేడియంలో జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్ లో పాల్గొనడానికి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా క్రీడాకారిణులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పవిత్ర వాణి కర్ర మరియు అధ్యాపక బృందం మరియు శారీరక విద్యా విభాగం హెచ్ఓడి టి.లక్ష్మి అభినందనలు తెలియజేశారు.

## లారీ ఢీకొని యువతి మృతి

**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 18వ తేదీ ఉదయం గృహప్రవేశానికి సంబంధించిన దేవుడి ఫోటోలు మరియు సామగ్రి తీసుకురావడానికి 21 ఏళ్ల భావని సాయి దీక్షిత అనే యువతి తనకు పరిచయమున్న కందిబండ సంతోష్ కుమార్ (24)తో కలిసి యాక్టివా స్కూటీ (TS07HH0263)పై హైదరాబాద్‌కు వెళ్లింది. సాయంత్రం సుమారు 4:17 గంటల సమయంలో దేవుడి ఫోటోలు తీసుకుని తిరిగి వస్తుండగా NH44 రహదారిపై బూర్జుగడ్డ తాండా యూటర్న్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ (KA01AP7606) స్కూటీని ఢీకొట్టింది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఢీకొన్న ప్రభావంతో యువతి స్కూటీ నుంచి కింద పడగా, లారీ ముందరి టైరు ఆమెపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడిపిన సంతోష్ కుమార్‌కు కుడి కాలుకు మరియు రెండు చేతులకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ రామ్‌నివాస్ (58), మధ్యప్రదేశ్‌కు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సర్పంచ్‌లకు ప్రజాపాలనపై ఐదు రోజుల శిక్షణ

**రెండవ రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో శ్రీవాణి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులకు ప్రజాపాలనపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 17న ప్రారంభమై 21వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా సర్పంచ్‌లకు ముచ్చింతల లోని స్వర్ణ భారతి నిలయం వద్ద జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవో శ్రీవాణి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించబడుతున్నాయి. అలాగే హయత్‌నగర్ లోని అబ్దుల్లాపూర్మెట్ మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ మండల పరిషత్ ఆఫీసర్




(ఎంపీఓ ) తుల్జా ప్రసాద్ రావుతోపాటు టి ఓ టి లు ఈ శ్రీనివాస్ సూరిబాబు రవి కిరణ్ ల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.

బుధవారం రెండవ రోజు శిక్షణ తరగతుల్లో భాగంగా ఎంపీడీవో ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామ పంచాయతీ పరిపాలనలో సర్పంచ్‌ల బాధ్యతలు, 2018 పంచాయతీ రాజ్ చట్టం పై అవగాహన, గ్రామాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, తీర్మానాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, ప్రజా సేవలో పారదర్శకత, పరిపాలనలో నైపుణ్యత పెంపు వంటి అంశాలపై వివరించారు.

గ్రామాభివృద్ధికి అనుకూల పరిస్థితులు సృష్టించేందుకు ప్రతి ప్రజాప్రతినిధి సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం ద్వారా గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపించాలని తెలిపారు.శిక్షణ తరగతులు సాఫీగా కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిఓటిలు ఈ. శ్రీనివాస్, ఏ. సూరిబాబు, రవికిరణ్ రెడ్డి తోపాటు కవాడి పల్లి ఉప సర్పంచ్ రమేష్ రాసాల, జాఫర్ గూడ ఉపసర్పంచ్ జంగారెడ్డి, చిన్న రావిర్యాల ఉపసర్పంచ్ శిరీష శివ శంకర్ రెడ్డి, బలిజ కూడా ఉప సర్పంచ్ ఉప్పు నరేష్, బాటసింగారం ఉప సర్పంచ్ నార్లకొండ వెంకటేష్, లష్కర్ గూడా ఉపసర్పంచ్ కరిమల రాజు, గుంతపల్లి ఉప సర్పంచ్ కరిమెల నర్సింగరావు, వివిధ గ్రామాల అధికారులు తదితరులు పాల్గొన్నారు. .

## నిందితుడికి 5 సంవత్సరాల కారాగార శిక్ష

**అదనంగా బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం**

**విశాలభారతి, గోదావరిఖని:**

గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2015 సంవత్సరంలో నిందితుడు ముత్యాల సుదర్శన్, తండ్రి లింగయ్య, గోదావరిఖని నివాసిపై భారతీయ శిక్షాస్మృతి ఐపీసీ సెక్షన్లు 493, 496 మరియు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టం సెక్షన్లు 3(1)(x), 3(2)(v) కింద కేసు నమోదు చేయబడింది.ఈ కేసు Cr.No.285/2015, SC No.74/2017గా నమోదై, కరీంనగర్ జిల్లా పరిధిలోని 3వ అదనపు జిల్లా & సెషన్స్ కోర్టు, ప్రత్యేక ఎస్సీ & ఎస్టీ కేసుల విచారణ న్యాయస్థానంలో విచారణ జరిగింది. విచారణ అనంతరం న్యాయమూర్తి ఏ.నీరజ నిందితుడికి 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.4,000 జరిమానా విధించారు.అదనంగా బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం కాంపెన్సేషన్ చెల్లించాలని ఆదేశించారు. ఎఫ్‌సీఐ రామగుండం నివాసురాలైన గంగారపు శారదాదేవి, 2008 సంవత్సరంలో అడ్డగుంటపల్లి, గోదావరిఖనికి చెందిన ముత్యాల సుదర్శన్ తో పరిచయం ఏర్పడింది. 2010లో అతడు ఆమెను పెళ్లి చేసుకుని ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నాడు. అనంతరం కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత ఆమెను గర్భవతిని చేసి,నీకు నాకు సంబంధం లేదు, అంటూ ఆమెను, ఆమె తమ్ముడిని, తల్లిని దూషించి మోసం చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది.ఆ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి డీఎస్పీ ఎస్. మల్లారెడ్డి ప్రస్తుతం అడిషనల్ డీసీపీ, సైబర్ క్రైమ్, హైదరాబాద్ గా వ్యవహరించగా, కోర్టులో ప్రభుత్వ తరపున ఏపీపీ కోలా ఝాన్సీ వాదనలు వినిపించారు. కోఆర్డినేషన్ ఆఫీసర్‌గా ఏ.ఇంద్రసేనారెడ్డి ఇన్‌స్పెక్టర్, గోదావరిఖని వన్‌టౌన్, లైజన్ ఆఫీసర్‌గా వి.తిరుపతి రావు, సీడీఓగా ఏ.మహేందర్ విధులు నిర్వహించారు.బాధితురాలికి న్యాయం జరిగేలా పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి,పక్కా సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించడంతో నిందితుడికి శిక్ష ఖరారు చేయడంలో ప్రాసిక్యూషన్ టీమ్ కీలక పాత్ర పోషించింది.ఈ సందర్భంగా వారిని అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## హయత్ నగర్ అస్తిత్వంపై పరిపాలనా దాడి ఆపాలి

**చారిత్రక ప్రాంతాన్ని ఖాళీ కాగితం చేసేందుకు ప్రయత్నమా? – ప్రభుత్వాన్ని నిలదీసిన సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**



400 ఏళ్ల చరిత్ర కలిగిన హయత్ నగర్ అస్తిత్వాన్ని పరిపాలనా నిర్ణయాల పేరుతో చెరిపివేయాలనే ప్రయత్నాలు తక్షణమే ఆపాలని తెలంగాణ తెలుగు యువత అధికార ప్రతినిధి సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి ప్రభుత్వం ఉన్నతాధికారులను గట్టిగా హెచ్చరించారు. బుధవారం హయత్ నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చరిత్రను కాపాడాల్సిన వారు చరిత్రను చెరిపివేయడానికి ఎందుకు తొందరపడుతున్నారు?" అంటూ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ప్రశ్నించారు. ఒకప్పుడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తాలూకాగా, తరువాత అతిపెద్ద మండలంగా గుర్తింపు పొందిన హయత్ నగర్‌ను నేడు కేవలం రెండు గ్రామాల పరిమితిలో బంధించడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వికారాబాద్, తాండూర్, చేవెళ్ల, మల్కాజిగిరి వంటి ప్రాంతాలకు సేవలందించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్న ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని నిలదీశారు. జీహెచ్ఎంసీలోనే అతిపెద్ద డివిజన్‌గా ఉన్న హయత్ నగర్‌ను విభజనల పేరుతో కుదిస్తూ, హయత్ నగర్ పేరుతో ఉన్న సర్కిల్ కార్యాలయాన్ని బీ.ఎన్.రెడ్డి నగర్‌కు తరలించడం ప్రజల గౌరవాన్ని తాకే నిర్ణయమని మండిపడ్డారు. హయత్ నగర్ పేరుతో ఉన్న కార్యాలయం హయత్ నగర్‌లోనే ఉండాలి. లేకపోతే అది పరిపాలనా అన్యాయం మాత్రమే కాదు, చరిత్రపై దాడి అని స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయం, మండల ఎడ్యుకేషన్ ఆఫీస్ వంటి కీలక ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నప్పటికీ, డివిజన్ కార్యాలయాన్ని స్థానికంగా ఏర్పాటు చేయకుండా వేరే ప్రాంతానికి తరలించడం వెనుక ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. సువిశాలమైన మండల పరిషత్ ప్రాంగణంలోనే హయత్ నగర్, నాగోల్ డివిజన్ కార్యాలయాలను, అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి పూర్తి స్థాయిలో అవకాశం ఉందని వివరించారు. ప్రజల భావోద్వేగాలను, చారిత్రక గౌరవాన్ని పరిగణలోకి తీసుకోకుండా తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని హయత్ నగర్ అస్తిత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. హయత్ నగర్ డివిజన్ కార్యాలయాన్ని తరలించడాన్ని అడ్డుకునేందుకు పార్టీలకు అతీతంగా ప్రజలు ఏకం కావాలని, అవసరమైతే ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఇది కార్యాలయాల పోరాటం కాదు... హయత్ నగర్ గౌరవం కోసం జరుగుతున్న అస్తిత్వ పోరాటం అంటూ ప్రభుత్వానికి చివరి హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే హయత్ నగర్ గళం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఎస్పి రోహిత్ రాజ్‌ని కలిసిన మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి



- **మండలంలో పలు సమస్యలపై వినతి పత్రం అందజేత**
- **పారిశ్రామిక ప్రాంతాలలో నిఘా పెంచాలి**
- **లక్ష్మీపురం,సారపాక రద్దీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వినతి**

**బూర్గంపాడు, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం ఎస్పి కార్యాలయం నందు ఐపిఎస్ రోహిత్ రాజ్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి. బూర్గంపాడు మండలంలోని పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.లక్ష్మీపురం, సారపాక పారిశ్రామిక ప్రాంతం కావడంతో వాణిజ్య,వ్యాపార, రవాణా దృష్ట్యా నిత్యం ప్రజలు జీవనోపాధి కోసం ప్రయాణాలు చేస్తుండగా కొన్ని ఏరియాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేయాలని తెలిపగా పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఎస్పి త్వరలోనే పారిశ్రామిక ప్రాంతాలను పరిశీలించి కావలసిన భద్రత చర్యలు చేపట్టానున్నట్లు తెలిపారు. అనంతరం లక్ష్మీపురం ఆదర్శ రైతు యారం లక్ష్మిరెడ్డిని, ఎస్పికి, పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంగువ రమేష్, ఆదర్శ రైతు యారం లక్ష్మిరెడ్డి, మేడిపల్లి ఉదయ్ పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన రామగుండం ఎమ్మెల్యే



**విశాలభారతి, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన రామగుండం నగర పాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, నూతన కార్పొరేటర్లు బుధవారం రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిశారు.

## లయన్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన చైర్మన్‌కు సన్మానం




**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని లైన్స్ భవనం నందు చౌటుప్పల్ పురపాలక మున్సిపాలిటీ నూతనంగా ఎన్నికైనటువంటి మొదటి మహిళా చైర్పర్సన్ ముదల పావని రమేష్ గౌడ్ కు లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లయన్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లప్ అప్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు తిరందాసు జగన్,ట్రస్ట్ చైర్మన్ మరియు చార్టెడ్ ప్రెసిడెంట్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా మరియు క్లబ్బు సభ్యులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించండి

**మోగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్**



**చౌటుప్పల్ విశాలభారతి:** నూతన మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన నాకు బొకేలు శాలువాలు కాకుండా..ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమయ్యే విద్య సామాగ్రి అందించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ లు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన మోగదాల పావని రమేష్ గౌడ్ లను మున్సిపాలిటీ 14 వార్డు గణేష్ నగర్ కు చెందిన ప్రముఖ ఎన్జీఓ ఒరగంటి శీను,ఓరగంటి నరసింహ సోదరులు,ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీ ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానని తెలిపారు.నా ఆశయాల మేరకు చౌటుప్పల్ హై స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, అందజేసిన ఒరగంటి శ్రీనును మొగుదల పావని రమేష్ గౌడ్ ల ను అభినందించారు.అనంతరం వరగంటి శ్రీను గౌడ్ మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపల్ నూతన చైర్మన్గా ఎన్నికైన పావని రమేష్ గౌడ్,నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.చైర్ పర్సన్ గా ఎన్నికైన పావని రమేష్ గౌడ్ లు సన్మాన కార్యక్రమానికి బొకేలు శాలువలు బదులు విద్యా సామాగ్రి అందించాలని పిలుపునివ్వడం మిగతా ప్రజాప్రతినిధులకు నిలుస్తున్నారని చెప్పారు.పావని రమేష్ గౌడ్ ల పిలుపుమేరకు పరీక్ష విద్యా సామాగ్రి అందజేశానని ఈ సందర్భంగా చెప్పారు.

## మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డితోనే కోదాడ అభివృద్ధి సాధ్యం

**మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ బాబు**



**కోదాడ, విశాలభారతి :** సాధారణ ఎన్నికలలో గెలుపొంది కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన ఎర్నేని కుసుమ బాబు బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని మేళ్లచెరువులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా బొకేతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్పర్సన్ కుసుమా బాబు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆశీస్సులతోటే నేను మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైనని గుర్తు చేశారు. వారి సహాయ సహకారాలతోటి కోదాడను తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని గుర్తు చేశారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహాయ సహకారాలు మాకు ఎల్లవేళలా ఉండాలని అన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కోదాడ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి డెలిగేట్ బార్అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లీశ్వరి, రావెళ్ళ కృష్ణారావు, ప్రసాద్, దావల్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన

**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ మున్సిపాలిటీ లోని అనంతారం రోడ్లో గల మోడల్ స్కూల్ మరియు మహబూబాబాద్ బస్టాండ్ సమీపంలో గల నలంద డిగ్రీ కాలేజీలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల దుర్వినియోగంపై మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ జి. చిరంజీవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు గంజాయి మరియు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించడం జరిగింది. తదుపరి వారు ఎటువంటి చెడు వ్యసనాలకు అలవాట్లకు లోను కాకుండా, తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా, మంచిగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించి/ ఉన్నత ఉద్యోగులుగా జీవితంలో స్థిరపడాలని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎక్సైజ్ ఎస్సై మౌనిక, కానిస్టేబుళ్లు వెంకట నరసయ్య, యాదగిరి, రాజు, శ్రీనివాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు, నలంద డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ పాల్గొన్నారు.







# రెండేళ్లలో నల్లగొండకు 'స్మార్ట్' రూపురేఖలు

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్లగొండ, విశాలభారతి :**



రానున్న రెండేళ్లలో నల్లగొండ పట్టణాన్ని అత్యాధునిక హంగులతో కూడిన స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38, 41వ డివిజన్లలో సుమారు కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని పార్కులను మోడల్ పార్కులుగా అభివృద్ధి చేస్తామని, రాజధాని హైదరాబాద్ తరహాలో సకల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో శానిటేషన్, తాగునీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని, నిరంతర నీటి సరఫరా కోసం ఇప్పటికే లతీఫ్ షాబ్ గుట్ట వద్ద పనులు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నామని, సుమారు 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని మంత్రి వివరించారు. విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు పట్టణం చుట్టూ ఎనిమిది కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం, లైన్ల షిఫ్టింగ్ పనులు చేపట్టామన్నారు. విద్యారంగంలో మార్పులు తెస్తూ బొట్టుగూడ పాఠశాల తరహాలోనే మరిన్ని సర్కారు బడులను ఆధునీకరిస్తామని, అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పారిశ్రామికంగా నల్లగొండను హబ్ గా మారుస్తామని, ఎస్ఎల్ బిసీ సొరంగం లైనింగ్ పనులు కూడా ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీయిజం, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నల్లగొండలో పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా వాకింగ్ ట్రాక్ లు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, ఇదే స్ఫూర్తితో ఇతర మున్సిపాలిటీలు కూడా అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని పార్కుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా తమ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని, నల్లగొండను రాష్ట్రంలోనే ఆదర్శ కార్పొరేషన్ గా నిలుపుతామని కలెక్టర్ స్పష్టం చేశారు.

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్కుల్లో పిల్లల కోసం ఆట వస్తువులు, సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. నల్లగొండను చెత్త రహిత పట్టణంగా మార్చడమే లక్ష్యమని, దీనికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, డిప్యూటీ మేయర్ అబ్బాయి అలీ, మున్సిపల్ కమిషనర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా ఇకపై పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

## దంతెల బోర విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాల పంపిణీ



**పాల్వంచ విశాలభారతి:** దంతెలబోర ప్రాథమికోన్నత పాఠశాలలో ఎర్ర బోరు మరియు సీతారాంపురం నుంచి వచ్చే పిల్లలకు తెలుగు మరియు ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాల పంపిణీ కొరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లెంపాటి వెంకటేశ్వర్లు గారి అధ్యక్షతన సమావేశం పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రాథమికోన్నత పాఠశాల దంతెల బోర నకు ఎర్ర బోరు మరియు సీతారాంపురం గ్రామం నుండి వచ్చే విద్యార్థులకు తెలుగు మరియు ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాలను మరియు పెన్సిల్లు లేక ఇబ్బంది పడుతున్న సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కోరిన సందర్భంగా గ్రామ సర్పంచ్ అందించిన తెలుగు ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాలను 40 మంది పిల్లలకు గ్రామ సర్పంచ్ కొండ ప్రసాద్ గారు తెలుగు మరియు ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాలను అందించడం జరిగింది. ఈ పుస్తకాలను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దంతెల బోర గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండ్రు ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కొండ్రు ప్రసాద్ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే విద్యా వైద్య సౌకర్యాలు బాగుండాలని ఈ క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటేశ్వర్లు మరియు ఉపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా తన వంతు గా తెలుగు మరియు ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాలను అందించడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ద్వారా కొనుగోలు చేసిన రీఛార్జింగ్ ఆడియో సిస్టం ను గ్రామ సర్పంచ్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యాదగిరి, రామేశ్వరి, ఈరు, భీము, మంగీలాల్, గ్రామస్తులు నాగిరెడ్డి, సత్యనారాయణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌ను సందర్శించిన



**అంతర్గత మార్కుల పరిశీలనా బృందం**

**పాల్వంచ విశాల భారతి:** జిల్లా విద్యాశాఖ నియమించిన పదవ తరగతి అంతర్గత మార్కుల పరిశీలన బృందం కె. మంగమ్మ, జడ్పీ హెచ్ ఎస్, పాల్వంచ నేతృత్వం లో స్థానిక మార్కెట్ ఏరియాలో గల స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ ను బుధవారం సందర్శించారు. ఈ బృందం పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థుల యొక్క ఫార్మేటివ్ అసెస్మెంట్స్ కు సంబంధించిన ప్రాజెక్ట్ వర్క్స్ మరియు వాటి నాణ్యత, క్లాస్ వర్క్స్, స్లిప్ టెస్ట్స్ నిర్వహణ మరియు మార్కుల నమోదు ప్రక్రియను అత్యంత క్షుణంగా పరిశీలించారు. అనంతరం టీం లీడర్ మాట్లాడుతూ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థుల యొక్క అంతర్గత మార్కుల రికార్డుల నిర్వహణ మరియు మార్కుల కేటాయింపు విద్యాశాఖ సూచనల మేరకు అత్యంత స్పష్టంగా పారదర్శకంగా ఉన్నాయని అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా మార్చి 14 నుండి నిర్వహించబోయే వార్షిక పరీక్షలకు సంబంధించి పరిశీలనా బృందం లోని అధ్యాపకులు వై. సంగమేశ్వర రావు, బి. ప్రభాకర్, పి. పుల్లారావు, వి. మల్లీశ్వరి విద్యార్థులకు అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఈనెల 28వ తేదీన పదవీ విరమణ కాబోతున్న బి. ప్రభాకర్ ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జి. భాస్కర్ రావు, ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ రెడ్డి, పదవ తరగతి బోధనా సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎస్.జె.కె.అహ్మద్



**పాల్వంచ విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పాల్వంచ పట్టణానికి చెందిన ఎస్.జె.కె. అహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్.. అహ్మద్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవా దళ్ జాతీయ అధ్యక్షుడు లాల్ జీ దేశాయ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. సేవాదళ్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, సమాజ సేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతానని తెలిపారు. సేవా కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన అహ్మద్ ను కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించడం పట్ల పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పార్టీ నాయకులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**రామసహాయంకు అత్యున్నత స్థాయి గౌరవం**



**ఖమ్మం విశాలభారతి:** ఖమ్మంపార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరి 19న ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగానే ప్రత్యేకంగా లేఖలు పంపి అభినందనలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన సందేశంలో దేశ అభివృద్ధి, సమగ్ర పురోగతికి రఘురాం రెడ్డి సేవలు కీలకమని పేర్కొన్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా తన సందేశంలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశానికి అంకితభావంతో కొనసాగుతున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రధాని, రాష్ట్రపతిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేశ అత్యున్నత నాయకుల ఆశీర్వాదాలు తనపై ఇంకా బాధ్యతను పెంచాయని, ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతానని అన్నారు.

## గృహ నిర్మాణం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి

**సమగ్ర సమీక్ష లోఎమ్మెల్యే పాయం**




**మణుగూరు, విశాలభారతి :** మండల పరిధిలో హౌసింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అమలు అవుతున్న గృహ నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై బుధవారం ఎమ్మెల్యే పాయం స్తానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏం ఆర్ ఓ, ఏం పి డి ఓ, ఎఫ్ డి ఓ, ఎఫ్ ఆర్ ఓ, ఐటి డి ఎ, ఏ ఈ,తదితర శాఖల అధికారులు పాల్గొని తమ తమ విభాగాల పనుల పురోగతిని వివరించారు. మండలంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ స్థితి, పూర్తి అయిన గృహాలు, నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కాని పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గృహ నిర్మాణ పనులు పూర్తి చేసుకునేలా అవసరమైన సాంకేతిక సహాయం, నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గృహ నిర్మాణం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ప్రతి దశలో పర్యవేక్షణ పెంచాలని, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ప్రయోజనాలు సమయానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతేకాకుండా, కాలనీలలో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు సమగ్రంగా కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో పని చేయాలని తెలిపారు. ప్రజలకు ఇళ్లు కేవలం నిర్మించడం మాత్రమే కాకుండా, నివసించడానికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశం ద్వారా హౌసింగ్ పనులు వేగవంతం అవడంతో పాటు లబ్ధిదారులకు త్వరితగతిన గృహాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ప్రజల పక్షాన నిలబడుతున్న కాంగ్రెస్ నాయకత్వం

**మోతే గ్రామంలో పర్యటించిన సర్పంచ్ పోలేబోయిన సుజాత , సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**



**విశాలభారతి, కరకగూడెం:** మండలం కరకగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మోతే గ్రామంలో పర్యటించి గ్రామ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి అక్కడ సిబ్బందిని కలిసి పరిస్థితులను పరిశీలించి ఆరోగ్య సంబంధిత సమస్యలను మరియు ప్రజల ఇతర సమస్యలు తెలుసుకున్న సర్పంచ్ పోలేబోయిన సుజాత మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల పక్షాన నిలబడే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం మరియు మన అభిమాన నాయకులు గౌరవ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో సమస్యలకు త్వరలో పరిష్కారం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి మల్ రెడ్డి , సిబ్బంది, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## పద్మాపురం నూతన 33/11 కెవి ఉపకేంద్రం పనుల పూర్తి

**విశాలభారతి, కరక గూడెం**: భద్రాచలం డివిజన్ పరిధిలోని కరకగూడెం సెక్షన్‌లో పద్మాపురం (గ్రామం) లో నిర్మించిన నూతన 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీ మోహన్ రావు ఉపకేంద్రాన్ని సందర్శించి పూర్తయిన పనులను సమగ్రంగా పరిశీలించారు. ఉపకేంద్రంలో అమలు చేసిన సాంకేతిక ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలు మరియు నిర్వహణ విధానాలను సమీక్షించిన ఆయన, భద్రతా అంశాలపై అవసరమైన సూచనలు జారీ చేశారు. సిబ్బంది అన్ని భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఉపకేంద్ర నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ/ ఆపరేషన్ కొత్తగూడెం. డి ఈ భద్రాచలం మరియు అధికారులు పాల్గొన్నారు. నూతన ఉపకేంద్రం త్వరలోనే ప్రారంభమై పరిసర గ్రామాలకు స్థిరమైన మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించనుందని అధికారులు తెలిపారు.



## అక్రిడేషన్లు పొందడంలో జర్నలిస్టుల ఇబ్బందులను తొలగించండి

**ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి డబ్ల్యూజేఐ ప్రతినిధుల వినతి**



ఖమ్మం విశాలభారతి: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం (ఐ అండ్ పీఆర్) జారీ చేసిన 'ది తెలంగాణ మీడియా అక్రిడేషన్ రూల్స్ 2025' లో కొన్ని నిబంధనలు జిల్లాల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు 'అక్రిడేషన్ కార్డులు' పొందడంలో ఇబ్బందిగా మారాయని, వాటికి వెంటనే సవరణలు చేయాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (WJI) ఖమ్మం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో అనుదీప్ దూరిశెట్టిని కలిసిన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎస్ రావు, ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కోకన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాస రావు, ఎం.ఏ అన్సార్ పాషా, అమరనేని రామకృష్ణ, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబరావు, బొద్దుపల్లి రవీందర్ అక్రిడేషన్లు పొందడంలో చిన్న పత్రికలు, డెస్క్,ఇండిపెండెంట్, వెబ్ సైట్, కేబుల్ టీవీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సారి 2,000 నుండి 15,000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు అసలు జిల్లా కేంద్రంలో అక్రిడేషన్ కార్డులే లేవని తెలిపారు. 15,000 నుండి 25,000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు ఒక్క జర్నలిస్టుకు మాత్రమే కార్డు (మండలం) ఇస్తున్నారని, ఫోటో గ్రాఫర్ కు కూడా కార్డు లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, 25,000 నుండి 75,000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు సహితం ఒక జర్నలిస్ట్, ఒక ఫోటో గ్రాఫర్ కు మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇస్తున్నారని, ఈ మూడు కేటగిరీల్లో డెస్క్ జర్నలిస్టులకు, జిల్లాలో ప్రచురణ కేంద్రం వుంటే ఒక్కొక్క కార్డు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇవి ఆయా పత్రికల్లో పని చేస్తున్న ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టులకు ఏ మాత్రం సరిపోనందున ప్రతి కేటగిరీలో కార్డులు పెంచాలని, జిల్లా కేంద్రాల్లో పని చేసే క్రైమ్, స్పోర్ట్స్, కల్చరల్, ఎడ్యుకేషన్ జర్నలిస్టులకు కూడా రాష్ట్ర స్థాయిలో ఇచ్చినట్లు 'అక్రిడేషన్ కార్డులు' ఇవ్వాలని కోరారు. డెస్కులో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, 'మహిళా జర్నలిస్టులు 33 శాతం లేని చోట ఆ కార్డులను మిగిలిన డెస్క్ జర్నలిస్టులకు ఇవ్వాలని, నిబంధనల్లో 'మాండేట్' అన్న పదాన్ని తొలగించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కార్డులు పొందాలంటే, ఇండిపెండెంట్ (ఫ్రీలాన్సర్) జర్నలిస్టులు 5 పాత కార్డులతో పాటు 6 నెలల్లో ప్రచురితమైన 20 బై లైన్ వార్తా క్లిప్పులు పపెట్టాలని విధించిన నిబంధనను సవరించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులు ఎక్కువగా చిన్న పత్రికలు, డిజిటల్ మీడియాలో వార్తలు రాస్తున్నందున, ఇండిపెండెంట్ జర్నలిస్టులు తమ వార్తలకు ఏ వేదికను ఉపయోగించుకున్నా , వార్త ఎక్కడ ప్రచురితమైనా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని సూచించారు. న్యూస్ వెబ్ సైట్లకు గడిచిన 6 నెలల్లో ... నెలకు 5 లక్షల యూనిక్ విజిటర్స్ వుండాలన్న నిబంధన కూడా సరైంది కాదని పేర్కొన్నారు. డిజిటల్ మీడియాలో ఒక యూనిక్ విజిటర్ ఒక పేపర్ సబ్ స్క్రైబర్ తో సమానమని కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

# పిల్లలు జాతీయ సంపద జెన్‌ఆల్ఫా తరం ఇది

- **వారికి మూస పద్ధతులు సరిపోవు**
- **సరికొత్త విద్యా ప్రణాళికలు కావాలి**
- **బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ వ్యవస్థాపకుడు శ్రీ తిలక్ స్పష్టీకరణ**

**హైదరాబాద్ :**





భారతదేశం మళ్ళీ పూర్వ వైభవం సాధించి, సర్వ శక్తి సంపన్నం కావాలంటే ఆ మార్పు మన పిల్లల పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య నుండే మొదలవ్వాలని బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ వ్యవస్థాపక డైరెక్టర్ శ్రీ తిలక్ గారు చెప్పారు. మన పిల్లలు, విద్యార్థులు జాతీయ సంపద అని స్పష్టం చేశారు. ఇటీవల బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ తిలక్ గారు మాట్లాడుతూ" 2014 నుంచి 2025 వరకు మధ్య జన్మించిన పిల్లలను 'జెన్ ఆల్ఫా' (Gen Alpha) గా వర్గీకరిస్తారు. మునపటి తరంతో పోల్చుకుంటే వీరి ఆలోచన తీరు భిన్నం. చాలా వేగంగా ఆలోచిస్తారు. వారి పరిశీలన శక్తి అద్భుతం. వీరికి అనుగుణంగా కరిక్యులం ను రూపొందించుకోవాల్సిందే. పుస్తకాల్లో ఉన్న విషయాన్ని యధాతథంగా వాళ్ళకి చెప్తే సరిపోదు. అందుకే మా విద్యా ప్రణాళికను వారికి అనుగుణంగా రూపొందించాము." అని చెప్పారు.

**ఒత్తిడి లేని అభ్యాసం.. సహజమైన ఎదుగుదల**

"ప్రీనర్సరీ నుండి గ్రేడ్ 2 వరకు ఎంతో కీలక దశ. ఈ కాలంలోనే బలమైన పునాది పడాలి. వారిపై ఎటువంటి బలవంతపు రుద్దుడు (Forceful Influence) లేకుండా జాగ్రత్త వహించాలి. పిల్లల ప్రపంచం వేరు. వారు తమదైన దృష్టితో ప్రపంచాన్ని చూస్తారు. అన్ లెర్నింగ్ అనేది అప్పటికి ఇంకా వారిలో మొదలు కాదు. పెద్దల ప్రపంచం వేరు. అన్ లెర్నింగ్ అనేది పెద్దలకు అలవాటైపోయి ఉంటుంది. లెర్నింగ్, అన్ లెర్నింగ్ మధ్య చక్కటి సమతుల్యతను సాధిస్తూ పిల్లలకు ఈ ప్రపంచాన్ని పరిచయం చేయాల్సి ఉంటుంది. అది బలవంతంగా ఉండకూడదు. వారంతట వారే, సహజంగానే ఈ మార్పును ఆహ్వానించుకునేలా, క్రమంగా పెద్దల ప్రపంచంలోకి, వాస్తవ ప్రపంచంలోకి వచ్చేలా చేయాల్సి ఉంటుంది. అప్పుడే వారిలోని సృజనాత్మక శక్తి తగ్గకుండా ఉంటుంది. వారి ఊహల ప్రపంచం నుండి వాస్తవ ప్రపంచంలోకి చాలా సున్నితంగా వారిని నడిపిస్తాం. అందుకే మా సంస్థకు BEST (Bharat Education Standard) అని పేరు పెట్టాం. ఇది కేవలం ఒక స్కూల్ కాదు, రేపటి పౌరులను తీర్చిదిద్దే ఒక సామాజిక బాధ్యత," అని చెప్పారు.

**ఊహల ప్రపంచానికి, వాస్తవానికి వారధి**

పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రశాంతి గారు మాట్లాడుతూ.. " మన పాఠ్య ప్రణాళికలు ఒక స్ట్రక్చర్ బ్లూప్రింట్ కు పరిమితమైపోతున్నాయి. కానీ, నేటి పిల్లల అపరిమితమైన ఊహాశక్తికి ఆ పాత పద్ధతులు సరిపోవు. అందుకే పిల్లల ఊహల ప్రపంచానికి (World of Imagination) , పరిణతి చెందిన జ్ఞానానికి (World of Wisdom) మధ్య ఒక బలమైన వారధిని నిర్మించడమే మా లక్ష్యం. ఇక్కడ పిల్లల్లో ఉండే సహజమైన ఉత్సాహాన్ని (Natural Spark) ఏమాత్రం తగ్గించకుండా, లోకపు తర్కాన్ని (Logic) వారికి పరిచయం చేస్తాం. మా వద్ద పిల్లలకు కేవలం నేర్చుకునే స్వేచ్ఛ (Freedom to Learn) కాదు, అనవసరమైన విషయాలను వదిలివేసే చొరవ (Agility to Unlearn), నాయకత్వం వహించే ధైర్యం కూడా లభిస్తాయి," అని పేర్కొన్నారు.

ఈ వినూత్న పాఠ్యప్రణాళికను అమలు చేయడానికి ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బ్రివోక్స్ ( 'Brivox') తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. నూతన తరం సిలబస్ డిజైన్ ద్వారా విద్యారంగంలో గుణాత్మక మార్పు తీసుకురావడమే ఈ ఒప్పందం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం.

బ్రివోక్స్ సీఈవో , రామప్రియాంక ఈడ్పుగంటి మాట్లాడుతూ బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్తో కలిసి ప్రయాణించటం సంతోషంగా ఉందన్నారు. మన దేశ పిల్లల భవిష్యత్తుకు సంబంధించి బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ డైరెక్టర్ శ్రీ తిలక్ గారికి అద్భుతమైన విజన్ ఉందన్నారు. "మనం మన పిల్లలకి ఇచ్చే 'Best Start' అంటే కేవలం మంచి మార్కులు మాత్రమే కాదు. అసలైన విద్య అంటే వారిలో ఆత్మపరిశీలన (Selfreflection), తట్టుకునే శక్తి (Resilience), మారుతున్న కాలానికి అనుగుణంగా మారే గుణాన్ని (Adaptability) పెంపొందించడం. పిల్లలకి వాళ్ల ఆలోచనలను కథల రూపంలో చెప్పే అవకాశం ఇస్తే, వారిలో అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (World Economic Forum) సభ్యురాలిగా మరియు 'ఉమెన్ ఇన్ టెక్' అంబాసిడర్‌గా, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ,భారతీయ విలువలకు అనుగుణంగానే మన పిల్లలను రేపటి నాయకులుగా తీర్చిదిద్దడమే బ్రివోక్స్, బెస్ట్ స్టార్ట్ ఆశయం." అని చెప్పారు.

## తెలంగాణ నేపథ్యంలో

# 'క్రేజీ కల్యాణం'

సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకుంది. కొత్తదనం కలబోసిన కథల్ని ఎంచుకుంటూ పాత్రలపరంగా ప్రయోగాలకు సిద్ధమంటున్నది. తెలుగులో ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేష్ వీకే, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. బుధవారం అనుపమ పరమేశ్వరన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పెళ్లి కూతురుగా ముస్తాబై పట్టరాని ఆనందంతో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నది అనుపమ పరమేశ్వరన్. పెళ్లి చుట్టూ సాగే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఆమె కీర్తి అనే పాత్రలో కనిపిస్తుందని, తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని మేకర్స్ తెలిపారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.